జనం గుండె చప్పుడు


# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || సోమవారం 14, అక్టోబర్ 2024 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం


## సీఎం చంద్రబాబుతో చిరంజీవి భేటీ


- వరద సాయం కింద సీఎం సహాయ నిధికి రూ.1 కోటి విరాళం అందజేత



హైదరాబాద్,మహానాడు: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని హైదరాబాద్ లోని ఆయన నివాసంలో ప్రముఖ సినీ హీరో, మెగాస్టార్ చిరంజీవి కలిశారు. ఎపిలో వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి తన తరపున రూ.50 లక్షలు, హీరో రామ్ చరణ్ తరపున రూ.50 లక్షల విరాళం అందించారు. సేవా కార్యక్రమాల్లో ఎప్పుడూ ముందుండే చిరంజీవి, వరద సాయం కింద రూ.1 కోటి అందించడంపై ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలిపారు. విరాళం చెక్కులు అందించేందుకు తన నివాసానికి వచ్చిన చిరంజీవికి సాదర స్వాగతం పలికిన సీఎం చంద్రబాబు నాయుడు, భేటీ అనంతరం కారు వరకూ వెళ్లి వీడ్కోలు పలికారు.

## బీజేపీ అధ్యక్ష రేసులో

# మోదీ ప్రత్యర్థి జోషి?



- తెరపైకి సంజయ్ జోషి పేరు
- ఆరెస్సెస్ దన్నుతో అధ్యక్ష రేసులో జోషి
- గడ్కరీ, రాజ్‌నాథ్‌సింగ్ వంటి అగ్రనేతల మద్దతు?
- గతంలో జోషిని యుపి ఇన్చార్జిగా నియమించిన గడ్కరీ
- మోదీ రాకతో జోషిని తప్పించిన వైనం
- నాడు మోదీతో పొసగకపోవడంతో ఢిల్లీకి
- జాతీయ సంఘటనా మహామంత్రిగా చేసిన జోషి
- జోషిని తప్పించకపోతే ప్రధానిగా పనిచేయనన్న మోదీ
- ఆయనను తప్పించిన తర్వాతనే మోదీ ప్రమాణస్వీకారం
- ఇప్పుడు మళ్లీ అధ్యక్ష ఎన్నికల్లో తెరపైకి జోషి రావడంతో ఉత్కంఠ
- జోషి పేరు రావడంతో బీజేపీ క్యాడర్‌లో ఉత్సాహం
- చిన్నవయసులోనే జాతీయ సంఘటనా మహామంత్రిగా చేసిన రికార్డు
- జోషి నియామకాన్ని మోదీ-షాలు అంగీకరిస్తారా?
- జోషి రాకతో బీజేపీ వర్గాల్లో పెరుగుతున్న జోష్



(మార్తి సుబ్రహ్మణ్యం)

బీజేపీతోపాటు దేశాన్ని కంటి చూపుతో శాసిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీని సవాల్ చేసే శక్తి ఇప్పట్లో ఎవరికీ లేదు. ఆయనను ఢీకొట్టే మొనగాడు కూడా ఏ పార్టీలోనూ భూతద్దం వేసినా కనిపించడం లేదు. అయితే ఒకప్పుడు మోదీ కంట్లో నలుసుగా ఉండే సొంతపార్టీ సీనియర్ నేత ఒకరు, మళ్లీ తెరపైకి రానుండటం ఆసక్తికరంగా మారింది.

సైద్ధాంతికంగా మోదీ వ్యతిరేకించే ఆ సంఘ దళపతి పేరు, ఇప్పుడు బీజేపీ జాతీయ అధ్యక్ష పదవికి విని పిస్తోంది. హటాత్తుగా ఆయన పేరు తెరపైకి వచ్చేందుకు, సంఘమే అసలు కారణమన్నది బహిరంగ రహస్యం. పార్టీలో తొలి నుంచి ఉప్పు-నిప్పుగా ఉన్న వారిద్దరి వ్యవహారం.. ఇప్పటి తరానికి తెలియకపోయినా, కమలం పాతకాపులకు కొట్టినపిండి.

మోదీని తొలి నుంచే సైద్ధాంతికంగా వ్యతిరేకించే ఆ యోధుడే సంజయ్ వినాయక్ జోషి. ఒకప్పటి బీజేపీ జాతీయ సంఘటనా మహామంత్రి. అంటే పార్టీ ఆర్గనైజింగ్ జనరల్ సెక్రటరీ అన్నమాట. బీజేపీలో ప్రధాని పదవి కంటే, ఈ జాతీయ సంఘటనా మహామంత్రి పదవే ఎక్కువ. ఇప్పుడు ఆ పదవిలో బీఎల్ సంతోష్‌జీ ఉంటే.. ఇరవైఏళ్ల క్రితమే జోషి ఆపదవిలో బీజేపీని వెలిగించారు.

గుజరాత్‌కు చెందిన ఇంజనీరయిన సంజయ్ జోషి ప్రభ, నితిన్‌గడ్కరీ ఉన్నంతవరకూ బీజేపీలో దేదీప్యమానంగా వెలిగింది. 2011-12లో జోషిని, అప్పటి బీజేపీ జాతీయ అధ్యక్షుడు గడ్కరీ యుపి ఇన్చార్జిగా నియమించారు. జోషి తొలి నుంచీ మోదీ వ్యతిరేకి అన్నది బహిరంగమే. మోదీ వ్యతిరేకులకు దన్నుగా నిలవడంతో, అక్కడి నుంచీ ఇద్దరి మధ్య దూరం పెరిగి.. అది చివరకు, సంజయ్‌జోషి ఉంటే పార్టీ ప్రచార బాధ్యతలు-ప్రధాని పదవి తీసుకోనని, మోదీ హఠం వేసేంత వరకూ వెళ్లింది.

ఒకప్పుడు పార్టీలో జోషి కత్తికి ఎదురులేదు. సమర్థుడైన ఆర్గనైజర్‌గా పేరుంది. ముచ్చటగా ముగ్గురు అధ్యక్షులు ఆయన హయాంలో పనిచేశారు. ఉత్తరాదిలో కాషాయం కళకళకు ఆయనో కారకుడు. పార్టీ శ్రేణులకు ఆయనో భరోసా. అపాయింట్‌మెంట్ పటాటోపం లేదు. బీజేపీలో తాను టాప్ బాసునన్న భేషజం లేదు. ఎవరైనా ఆయనను సులభంగా కలిసే అవకాశం ఉండేది. ఆయన పార్టీకి దూరంగా ఉన్నప్పటికీ.. ఇప్పటికీ రోజూ వందల మందిని ఆయనను కలుస్తున్నారంటే, పార్టీలో జోషి ముద్ర ఏ స్థాయిలో ఉందో స్పష్టమవుతుంది.


అయితే మోదీషా-రంగప్రవేశం, జోషిని విజయవంతంగా తెరవెనక్కి నెట్టేసింది. ఆయన ఇప్పుడు అధ్యక్ష ఎన్నికల్లో సుదీర్ఘ విరామానంతరం.. మళ్లీ తెరంగేట్రం చేస్తుండటం పార్టీలో సహజంగానే చర్చనీయాంశంగా మారింది.

బీజేపీలో ఒకప్పుడు ఎవరెంత గొప్పవారయినా దాని మార్గదర్శి ఆరెస్సెస్ తర్వాతే ఎవరైనా. వ్యక్తిస్వామ్యానికి విరుద్ధమైన బీజేపీలో తన చరిష్మా-త్యాగంతో ఆ పద్ధతిని పక్కనపెట్టి.. అదే వ్యక్తిస్వామ్యానికి తెరలేపిన నేత నరేంద్ర మోడీ అన్నది నిర్వివాదాంశం. గత పదేళ్లుగా ఆయన ప్రభ జాతీయ-అంతర్జాతీయ స్థాయిలో

మిగతా.. 2లో

## ఆ 'బాబు' బంగారమేనట!

- జగన్ ఏలుబడిలో ఓ ఐఏఎస్ చేతి మీదుగా అమూల్ పాలైన 2 వేల కోట్ల ఋణం
- క్విడ్ ప్రోకో పథకంలో 'కోడ్ ట్రీ' ద్వారా ఆ ఐఏఎస్‌కు భారీ నజరానా
- ఏమిటీ కోడ్ ట్రీ ?
- ఐఏఎస్‌కు కోడ్ ట్రీకి లింకేంటి?
- సోషల్ మీడియాలో విరుచుకుపడుతున్న తెలుగుతమ్ముళ్లు



7 లో

# లిక్కర్ ధరల సవరణపై గెజిట్ జారీ

- ఏ బాటిల్ ధర ఎంత?

అమరావతి,మహానాడు



కొత్త మద్యం పాలసీ అమలుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే ప్రభుత్వం నూతన ఎక్సైజ్ పాలసీ ఖరారు చేసింది. రిటైల్ దుకాణాలకు టెండర్ల ప్రక్రియ పూంయింది. ఈ నెల 16వ తేదీ నుంచి కొత్త మద్యం విధానం అమల్లోకి రానుంది. ఇదే సమయంలో ప్రభుత్వం తాజాగా లిక్కర్ ధరల సవరణ పైన గెజిట్ జారీ చేసింది. ఐఎంఎఫ్ఎల్ బాటిల్ ఎమ్మార్పీ ధరపై అదనపు ప్రివిలేజ్ ఫీజు విధిస్తూ సవరణ చేసింది.

### ప్రివిలేజ్ ఫీజు వసూలు

కూటమి ప్రభుత్వం ప్రకటించిన నూతన మద్యం విధానం ఈ నెల 16 నుంచి అమలు కానుంది. ఇప్పటికే కొత్త షాపులకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేసారు. భారీ స్థాయిలో టెండర్లు దాఖలయ్యాయి. లాటరీ పద్దతితో దుకాణాలు ఖరారు చేసి..ఈ నెల 16వ తేదీ నుంచి అమ్మకాలు ప్రారంభించాలని నిర్ణయించారు.

ఇదే సమయంలో ప్రభుత్వం తాజాగా భారత్‌లో తయారయ్యే విదేశీ మద్యం ఐఎంఎఫ్ఎల్ బాటిల్ ఎమ్మార్పీ ధరపై అదనపు ప్రివిలేజ్ ఫీజు విధిస్తూ సవరణ చేసింది. అదనపు ప్రివిలేజ్ ఫీజు కింద ఎమ్మార్పీ ధరలో చిల్లర కాకుండా తదుపరి పది రూపాయలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

### ధరలపై క్లారిటీ

ఏదైనా ఐఎంఎఫ్ఎల్ బాటిల్ ఎమ్మార్పీ ధర రూ 150.50గా ఉంటే.. ఆ దానిని రూ 160 వసూలు చేయనున్నారు. ఈ మేరకు ప్రివిలేజ్ ఫీజు అదనంగా పెంచింది. క్వార్టర్ బాటిల్ ధర 90.50గా ఉంటే ఏపీఎఫ్ కలిపి దాని ధర 100 రూపాయలు అవుతుంది. అయితే, క్వార్టర్ మద్యం ధర రూ 99 గా ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. దీంతో, రూ 100 ధరగా ఉంటే అందులో రూపాయిని మినహాయించి రూ 99కే విక్రయించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

మద్యం దుకాణాల టెండర్లకు ముగిసే సమయానికి రాష్ట్ర వ్యాప్తంగా 89,643 వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే, గడువు ముగిసే సమయానికి చాలా చోట్ల దరఖాస్తుదారులు లైన్లలో వేచి ఉండడం, కొందరు వ్యాపారులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు చేసుకోవడంతో మొత్తం దరఖాస్తులు 90 వేల దాటొచ్చని ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

### అందుబాటులో అన్ని బ్రాండ్లు

దరఖాస్తుల ద్వారా ప్రభుత్వం రూ 2 వేల కోట్ల మేరకు ఆదాయం సమకూరుతుందని అంచనా వేసారు. అయితే, రూ.1800 కోట్లపైనే ఖజానాకు ఆదాయం వచ్చిందని చెబుతున్నారు. ఇప్పటికే దాఖలైన టెండర్లను ఈ నెల 12,13 తేదీలలో పరిశీలన చేయనున్నారు. 14వ తేదీన జిల్లాలలో కలెక్టర్ల పర్యవేక్షణలో మద్యం షాపుల కోసం లాటరీ తీసి టెండర్ ఖరారు చేయ నున్నారు. ఈ నెల 16వ తేదీ నుంచి నూతన మద్యం విధానాన్ని అనుసరించి ప్రైవేటు మద్యం షాపులు రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన అన్ని బ్రాండ్ల మద్యం తిరిగి అన్ని దుకాణాల్లోనూ అందుబాటులోకి రానుంది.

## పోలీసు వ్యవస్థపై జనంలో నమ్మకం ఉంటుందా?

- ఏమి చేయలేకపోతే ఈ పోలీసు వ్యవస్థపై సాధారణ ప్రజలకు నమ్మకం ఉంటుందా?
- విజయ్ పాల్‌ను తక్షణమే అరెస్టు చేసి విచారణకు సహకరించడం లేదని సుప్రీంకోర్టుకు నివేదించాలి
- ఈ కేసులోని పెద్ద తలకాయలు కూడా సుప్రీంకోర్టును ఆశ్రయిస్తారా ?, లేకపోతే విజయ్ పాల్ పేర్లు చెప్పే వరకు వేచి చూస్తారా?
- ఎన్నో అరాచకాలను చేసిన సునీల్ కుమార్ అండ్ గ్యాంగ్
- ఒక పారిశ్రామికవేత్తను హింసించి డబ్బులను వసూలు చేసింది నిజం కాదా?
- గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి మాజీ సూపరిండెంట్ ప్రభావతి కొడుకుకు అవుట్ ఆఫ్ ది వే లో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాన్ని ఇవ్వలేదా?
- విజయ్ పాల్‌కు ఏడాది పొడిగింపు ఎందుకు..?
- ఉండి నియోజకవర్గ అభివృద్ధి కోసం రాజ్యసభ మాజీ సభ్యులు బీద మస్తాన్ రావు కోటి రూపాయల విరాళం
- ఉండి శాసనసభ్యులు రఘురామకృష్ణంరాజు

3లో..



06

నేను ఇచ్చిన మరో హామీ నెరవేరింది



07

పట్నం మహేందర్ రెడ్డి ఏ పార్టీకి చెందిన వ్యక్తి?




04

సీఐడీకి టీడీపీ ఆఫీసుపై దాడి కేసు!

## మద్యం టెండర్ల ద్వారా ప్రభుత్వానికి

# రూ.1797.64 కోట్ల ఆదాయం

- రాష్ట్రవ్యాప్తంగా 3396 మద్యం షాపులకు రికార్డ్ స్థాయిలో 89,882 దరఖాస్తులు
- అతి తక్కువగా దరఖాస్తులు వచ్చిన చోట పునఃపరిశీలన
- ఈసారి విదేశాల నుంచీ ఆన్‌లైన్‌లో మద్యం దుకాణాలకు దరఖాస్తులు
- అక్టోబర్ 14న మద్యం దుకాణాల కోసం లాటరీ, 15న దుకాణాలకు అనుమతి
- 16నుంచి అమల్లోకి నూతన మద్యం విధానం



అమరావతి,మహానాడు: ఆంధ్రప్రదేశ్‌లో మద్యం దుకాణాలకు దర ఖాస్తులు వెల్లువెత్తాయి. రాష్ట్రవ్యాప్తంగా 3396 మద్యం షాపుల కోసం మొత్తం 89,882 దరఖాస్తులు వచ్చాయి. మద్యం టెండర్ల ద్వారా ఏపీ ప్రభుత్వానికి ఏకంగా రూ.1797.64 కోట్ల ఆదాయం వచ్చింది. అక్టోబర్ 16 నుంచి రాష్ట్రంలో నూతన మద్యం పాలసీ అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు దరఖాస్తులు ఆహ్వానించగా రికార్డుస్థాయిలో వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా దాఖలైన దరఖాస్తుల ప్రకారం ప్రతి షాపునకు సగటున 25నుంచి 26 అప్లికేషన్లు వచ్చినట్లు తెలుస్తోంది. ఎన్టీఆర్ జిల్లాలో అత్యధికంగా, అల్లూరి జిల్లాలో అత్యల్పంగా దరఖాస్తులు దాఖలయ్యాయి. ఎన్టీఆర్ జిల్లాలో 113 మద్యం దుకాణాలకు గరిష్ఠంగా 5,800 దరఖాస్తులు వచ్చాయి.

జిల్లా పరిధిలో ప్రతి షాపునకూ 50నుంచి 51 దరఖాస్తులను టెండర్ దారులు దాఖలు చేశారు. అనంతపురం జిల్లాలో 12 దుకాణాలకు అతి తక్కువగా దరఖాస్తులు వచ్చాయి. దీంతో వీటిని పునఃపరిశీలించాలని ఎక్సైజ్ శాఖ భావిస్తోంది.

ఈసారి విదేశాల నుంచీ ఆన్‌లైన్‌లో మద్యం దుకాణాలకు దరఖాస్తులు పెద్దఎత్తున వచ్చాయి. అయితే టెండర్ల దాఖలులో భారీఎత్తున ఏర్పడిన మద్యం సిండికేట్లు. తొలి రోజులలో దరఖాస్తులు పెద్దగా పడకుండా ప్రయత్నాలు చేశారు. విషయం తెలుసుకున్న సీఎం చంద్రబాబు వార్నింగ్ ఇవ్వడంతో పరిస్థితి అదుపులోకి వచ్చినట్లు తెలుస్తోంది.

ఈ స్థాయిలో మద్యం దుకాణాల కోసం అప్లికేషన్లు రావడం ఇదే తొలిసారని ఎక్సైజ్ శాఖ అధికారులు చెప్తున్నారు. అక్టోబర్ 14న మద్యం దుకాణాల కేటాయింపు కోసం ఎక్సైజ్ అధికారులు లాటరీ నిర్వహిస్తారు. అందులో మద్యం షాపులు వచ్చిన వారికి ఈనెల 15న దుకాణాలకు అనుమతి అందజేస్తారు. దీంతో ఈనెల 16 నుంచి నూతనమద్యం విధానం ఏపీలో అమల్లోకి వస్తుంది. అన్ని రకాల బ్రాండ్లకు చెందిన చీప్ లిక్కర్‌ను రూ.99కే అందివ్వనున్నట్లు ఎక్సైజ్ శాఖ ఇప్పటికే తెలిపింది.





పొలిటికల్ జేఏసీ ఏర్పాటుకు

# అలయ్- బలయ్ స్ఫూర్తి

- అలయ్ బలయ్ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్,మహానాడు: గత 19 ఏళ్ల నుంచి దసరా సందర్భంగా రాజకీయాలకు అతీతంగా గౌరవింపబడే బండారు దత్తాత్రేయ అలయ్ బలయ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అంతరించిపోతున్న సంస్కృతి సంప్రదాయాలను, అలయ్‌బలయ్ ద్వారా దత్తాత్రేయ పునరుద్ధరించడానికి ప్రయత్నిస్తున్నారు. తెలంగాణ సంస్కృతిని నలు దిశలా వ్యాపించడానికి, తెలంగాణ ఉద్యమంలో రాష్ట్ర సాధన ఆలస్యం అయినప్పుడు పొలిటికల్ జేఏసీ ఏర్పాటు కు అలయ్, బలయ్ స్ఫూర్తిగా ఉపయోగపడింది. ఉమ్మడి రాష్ట్రంలో రాజకీయ పార్టీ ల వారీగా కార్యక్రమాలు జరిగేవి.

తెలంగాణ ఉద్యమ సాధనలో అన్ని వర్గాలు కార్యోన్ముఖులై అడుగు ముందుకు వేయడానికి అలయ్ బలయ్ ఒక కారణం. తెలంగాణ ప్రజలకు అతి పెద్ద పండుగ దసరా. దసరా అంటే పాలపిట్ట, జమ్మి చెట్టు గుర్తుకు వస్తాయి.అలయ్ బలయ్ అంటే గుర్తుకు వచ్చేది బండారు దత్తాత్రేయ.





దత్తాత్రేయ వారసురాలిగా అలయ్ బలయ్ నిర్వహిస్తున్న బండారు విజయలక్ష్మికి అభినందనలు. బండారు విజయలక్ష్మి దిగ్విజయంగా నిర్వహిస్తారన్న విశ్వాసం నాకుంది.


మా ప్రభుత్వం, పార్టీ పెద్దలంతా అలయ్ బలయ్ కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా తెలంగాణ సంప్రదాయాలు కాపాడుకోవడం మన బాధ్యత చెప్పాం. మేం అంతా ఒక్కటే అన్న సందేశాన్ని అలయ్ బలయ్ ద్వారా నాయకులు ఇచ్చారు.

# రాష్ట్ర పండగగా వాల్మీకి జయంతి

- ఈ నెల 17న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు
- పాదయాత్రలో మంత్రి లోకేశ్ ఇచ్చిన మరో హామీ అమలు

అమరావతి,మహానాడు:

యువగళం పాదయాత్రలో రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చింది. బీసీల ఆత్మగౌరవానికి పెద్దపీట వేస్తూ వాల్మీకి జయంతిని రాష్ట్ర పండగగా నిర్వహించాలని ఆదేశిం చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ




కార్యదర్శి ఉత్తర్వులు జారీచేశారు.

ఈ నెల 17న వాల్మీకి జయంతి సందర్భంగా అన్ని జిల్లా ల్లోనూ జయంత్యోత్సవాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణ యించింది. అదేరోజు రాష్ట్ర స్థాయిలో నిర్వహించే జయంత్యోత్స వాన్ని అనంతపురంలో నిర్వహించనున్నారు.

ఈ కార్యక్రమానికి ప్రభుత్వం తరఫున ప్రతినిధిగా రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత హాజరుకానున్నారు. వాల్మీకి జయంతిని రాష్ట్ర పండగగా నిర్వహించాలని ఆదేశిస్తూ అన్ని జిల్లాల బీసీ సంక్షేమ శాఖాధి కారులను ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

యువగళం పాదయాత్రలో వాల్మీకి జయంతిని రాష్ట్ర పండు గగా నిర్వహించాలని మంత్రి నారా లోకేశ్ కు అప్పట్లో పెద్ద సంఖ్యలో వినతులు అందాయి.





హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన నారా రోహిత్ వివాహ నిశ్చితార్థ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. నారా రోహిత్-శిరీషలను చంద్రబాబు నాయుడు-భువనేశ్వరి ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు.

# సమిష్టి కృషితో బ్రహ్మోత్సవాలు విజయవంతం

**- టీటీడీ ఈవో శ్యామలరావు**

తిరుమల, మహానాడు:

శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలను సమిష్టి కృషితో విజయవంతం చేశామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. ఈ మేరకు అన్నమయ్య భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఏమన్నారంటే.. 15 లక్షల మందికి వాహన సేవలను తిలకించేలా బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేశాం. 3.5 లక్షల మంది గరుడ సేవను వీక్షించారు. బ్రహ్మోత్సవాలపై భక్తుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఒక ప్రణాళిక బద్ధంగా బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను చేశాం. గత అనుభవాల దృష్టి ఉంచుకొని ఒక సూక్ష్మ ప్రణాళికను రూపొందించాం. సీఎం పట్టు వస్త్రాలు సమర్పించిన రోజున సూక్ష్మ ప్రణాళిక వివరించాం. సీఎం చంద్రబాబు కూడా మాకు కొన్ని సలహాలిచ్చారు. అన్ని విభాగాల అధికారుల సమన్వయం చేసుకొని భక్తులకు సంతృప్తికరంగా బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు చేశాం.



బ్రహ్మోత్సవాల్లో నాలుగు లక్షల మంచినీటి బాటిళ్లను సరఫరా చేశాం. గరుడ సేవ రోజున ఆర్టీసీ బస్సుల ద్వారా 2, 800 ట్రిప్స్ ద్వారా భక్తులు తిరుమల చేరుకున్నారు. ఆలయంలో నైవేద్యాలు 3.20 లక్షల మంది స్వీకరించారు. బ్రహ్మోత్సవాల్లో 30 లక్షల లడ్డూలు విక్రయాలు జరిగాయి. బ్రహ్మోత్సవాల్లో విద్యుత్ దీపాలంకరణలు, ఫల, పుష్ప ప్రదర్శన శాల, కళాబృందాల వంటి కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. పారిశుద్ధ్యం కోసం ఎక్కువ సిబ్బందిని వాడుకొని పరిశుభ్రంగా తిరుమలను ఉంచాం. బ్రహ్మోత్సవాల్లో ఆరు లక్షల మంది శ్రీవారిని దర్శించుకున్నారు. హుండీ ద్వారా రూ. 26 కోట్లు ఆదాయం వచ్చింది. బ్రహ్మోత్సవాల్లో 8 రోజులకు 475 లక్షల గ్యాలన్ల నీటిని వాడాం. గత ఏడాదితో పోల్చితే అధిక సంఖ్యలో ఈ ఏడాది బ్రహ్మోత్సవాలకు భక్తులు వచ్చారు.

# బాబుకు ప్రేమతో...

ఇక్కడంతా క్షేమం..!

ప్రియమైన మీకు..!

మీ మిత్రుడి సుపుత్రుడు వ్రాయు క్షేమ సమాచారములు.

గత ఎన్నికల్లో ఘనవిజయం సాధించి నన్ను ఘోరపరాజయం.. ఘోరపరాభవం పాల్జేసిన మీ కూటమి ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసి నాలుగు నెలలు అవుతున్నది. ఇప్పటికీ ఓటమి ని జీర్ణించుకోలేక పోతున్నాను. అసలు నమ్మలేకపోతున్నాను.నన్ను విడిచి ఒక్కొక్కరు వెళుతున్నారు.

అసలు తట్టుకోలేని విషయం.. ఒకటో తారీఖునే జీతాలు ఇచ్చేస్తున్నారు.

పెంచిన పెన్షన్లు వలంటీర్ల అవసరం లేకుండా పంపిణీ చేస్తున్నారు. ఖజానా అంతా ఖాళీ చేసినా మీరు బాగానే సర్దుబాటు చేసుకోగలుగుతున్నారు.

పైకి విమర్శిస్తాము కానీ, మీరు ఇచ్చిన హామీలు ఒక్కోటి అమలు దిశగా వెళుతున్నారు.

ఇసుక మద్యం పాలసీ మొదట్లో కొంచెం గజిబిజి ఉన్నా, మేము ఎంత అరచి గోల చేసినా అంతా సెట్ అయిపోద్ది.పెట్టుబడులు ఏంటండీ అలా వచ్చిపడిపోతున్నాయి. నాలుగు నెలల్లో అరవై వేల కోట్లు..! బుర్ర పాడయిపోతుంది.

నా హయాంలో మా పేటీయమ్ బేచ్‌కి సూట్లు వేసి హడావిడి చేసే వాళ్ళం.

అమరావతి పోలవరం ఇంకా ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చక్కగా చేస్తున్నారు. యదావిధిగా మేము విషం కక్కుతాము.

వరదలు తుపానులు ఇలాంటి విపత్తులొచ్చినపుడు..మీ కష్టం చూసి సిగ్గుపడాలి మేము. కానీ అసలు సిగ్గులేకుండా బరితెగించి దుష్ప్రచారం చేస్తున్నాము. మీరేమి అనరన్న ధైర్యం!

ఒక్కసారి తరచి చూసుకుంటే.. నా హయాంలో తీసుకున్న నిర్ణయాలు.. జరిగిన అక్రమాలు అన్యాయాలు..అవినీతి..దాడులు దుర్మార్గం..చట్ట ఉల్లంఘనల పట్ల మీరు మీ బృందము నిత్యం తీవ్ర విమర్శలు చేశారు.

నా అధికారం అంతమైన తర్వాత మీరు కఠిన చర్యలు తీసుకుంటారేమో అని గుబులు కలిగింది. అందుకే హడావిడి గా తాడేపల్లి వదిలి బెంగుళూరు చెక్కేసాను. ఎందుకైనా మంచిదని ఢిల్లీ వెళ్ళి లొల్లి చేసాను.

అసలే మీరు నెమ్మది..ఎందుకొచ్చిన గోల అని తగ్గుతారు అని! నా స్కెచ్ వర్కవుట్ అయింది. మా వాళ్ళని అరెస్టు చేసినా నోటీసులు తో పాటు కూల్ డ్రింక్ ఇచ్చి పంపిస్తున్నారు.

మీరంటే భయం లేదు కాని..మీ అబ్బాయి లోకేష్ అన్నా..పవన్ కళ్యాణ్ అన్నా కొంచెం అదురు ఉన్నది. వాళ్ళ బేటరీ కూడా తీసేసినట్టున్నారు.

ఇప్పటికీ నేను చేసింది కరెక్టే అని నమ్ముతున్నాను. నేను నమ్ముకున్న వ్యవస్థలు..నన్ను ఎప్పటికప్పుడు నన్ను ఆదుకుంటున్నాయి.

ఇప్పటికీ అసలు ఎప్పటికీ అర్థం కాని అర్థం చేసుకోలేని విషయం ఏమిటంటే.. మిమ్మల్ని మీ కుటుంబాన్ని నానా దుర్భాషలాడిన వారిని ఎందుకు వదిలేశారు!?

మీ పార్టీ కి దేవాలయం లాంటి ప్రధాన కార్యాలయం మీద దాడి చేసిన వారిని గెడ్డం కింద బెల్లం ముక్క పెట్టి ఎందుకు బతిమ లాడుతున్నారు!?

నడిరోడ్డు మీద మీ కార్యకర్తల్ని ఊచకోత కోయించాను.

మీ నాయకుల్ని తుక్కు రేగ్గొట్టించాను.

మా యంపీ..ఇప్పుడు మీ ఎమ్మెల్యే రాజుగారిని ఏకంగా ఒళ్ళు హూనం అయ్యేలా కొట్టించాను.

అసలు నేనే కొడదామనుకున్నాను.

మా వాళ్ళు ఆపారు.

మిమ్మల్ని మీ అబ్బాయిని ఎంత ఇబ్బంది పెట్టానో నాకు ఇప్పటికీ గుర్తుంది..అలాంటిది అది అనుభవించిన మీరెలా మరచి పోయారు!?

అసెంబ్లీ గేటు దగ్గర ఛీఫ్ మార్షల్ని ఉసిగొలిపి మీ మీదకు పంపాను.

అతను నా కళ్ళలో ఆనందం కోసం మీ పట్ల దురుసుగా వ్యవహరించాడు.



అతని పట్ల మీ ఔదార్యం.

చాలా ఆశ్చర్యంగా ఉన్నది.

మితిమీరిన క్షమాగుణం..దయ నేను తట్టుకోలేకపోతున్నాను.

నా బూట్లు నాకిన అధికారుల్ని మీరు క్షమించి వదిలేస్తున్నారు.

మీ సభ్యులు కూడా రాజీ చేసుకుని వాళ్ళకు అవకాశం ఇస్తున్నారు.

ఇది అసలు ఊహించలేదు.

అచ్చెంనాయుడు ని చూస్తే భయం వేసేది.

అంతెత్తున ధ్వజస్థంభం లా ఉంటాడు.

విచిత్రంగా అతను కూడా ఏమీ అనటం లేదు.

ఇలా అనేక మందిని వేధించాను..వెంటాడాను.

నాయకులు..కేడరు..అధికారులు ఎవర్నీ వదలలేదు.

ఎన్నో అపచారాలు చేసాను.

ఎంతో కొల్లగొట్టాను.

మరెన్నో అక్రమాలు చేసాను.

అమరావతి మహిళలు, రైతులు, వృద్ధులను అయితే అత్యంత నీచంగా జుగుప్సాకరంగా వేధించాము.

వారిని మానసికంగా కృంగదీసి కొందరి చావుకు కారణ మయ్యాను.

సాక్షాత్తూ మిమ్మల్నే ఎత్తేసాను. దొంగ కేసులు పెట్టి.

అంతెందుకు ఒక్కమాటలో చెప్పాలంటే అన్నిరకాలుగా విధ్వంసం చేసాను.

నన్ను మా వాళ్ళను అలా వదిలేస్తున్నారేంటండి..!?

ఇంత సంయమనాన్ని నేనే తట్టుకోలేకపోతున్నాను.

మీ కేడరు..బాధితులు..మీకోసం తల్లడిల్లిన వారి పరిస్థితి ఏంటో మరి!

మీరు నిన్నొక మాట చెప్పారు..కక్షరాజకీయాలు చేయను..నేనూ బాధితుడనే అని!

నోబుల్ శాంతి బహుమతి ఇవ్వాలి మీకు కచ్చితంగా!

మీ చేతుల్లో రాష్ట్రం బాగుపడుతుంది.

ప్రత్యర్థుల రక్షణ కూడా మీరే బాధ్యత తీసుకుంటారు.

అంతా అమిరిన తర్వాత ఎప్పుడో ఒకప్పుడు నేనో నాలాంటి వాడో వస్తాడు..అప్పుడు శుభ్రంగా ఖాళీ చేస్తాడు. మీ వాళ్ళను ఊచకోత కోస్తాడు.

అప్పుడు మీ శాంతి వచనాలు అక్కరకు రావు. మీ కేడరు ఇప్పటికే కాడి పడేసారు.

మీరు అధికారంలో ఉన్నారు కాబట్టి తెలియటం లేదు.

మీ సామాజిక వర్గం దాదాపు అరవై డబ్భై శాతం మీకు దూరం జరిగారు.

మీరు ఎవరినైతే నమ్ముకున్నారో వాళ్ళు కష్టం లో అండగా నిలవరు.

ఇది చరిత్ర చెప్పిన సత్యం..!

మీకు నాకూ తేడా ఉంది చాలా!

మీరు సౌమ్యులు..నేను క్రూరుడను.

మీరు అభివృద్ధి కాముకులు.

నేను విధ్వంసకారుడిని..!

మీరు వ్యక్తులకు ఉపయోగపడరు..మొత్తం సమాజ హితం కోరతారు.

నేను నా వాళ్ళను చూసుకుంటాను..సమాజం ఏమైపోయినా పర్వాలేదనుకుంటాను.

ఇలా అనేక విషయాల్లో మన ఇద్దరి మధ్య హస్తిమసికాంతరం ఉన్నది.

కానీ మీకు కష్టం వస్తే ఇన్నాళ్ళూ నిలబడే వాళు ళ్ళుండేవారేమో.. ఇప్పుడు ఉండరు.

అదే నాకోసం తలతీసే వారు..తల ఇచ్చేవారు ఉంటారు.

ఏది ఏమైనా మీరు ఆదర్శవంతులు!

తెలుగు వాడిగా గర్వపడుతున్నాను.

ఒక రకంగా ఈర్ష్యగా ఉన్నది.

ప్రజలు ఓడించారు.

మీరు నన్ను రాజకీయంగా పూడ్చిపెట్టేసారు.

నేను మాంసం కొట్టు పెట్టుకోమన్నాను.

మీరు వేలాది కార్పొరేట్ ఉద్యోగాలు ఇచ్చి నా మీద పై చేయి సాధిస్తున్నారు.

మరొక్కసారి మీ ఔదార్యానికి..పెద్దమనసుకి ప్రణామములు..!

చివరగా మీ కేడరు..ఎందుకు అసహనంగా ఉన్నారో చూసుకోండి.

ఇప్పటికింతే సంగతులు..!

కొద్దిరోజుల్లో మరొక లేఖ ద్వారా క్షేమసమాచారాలు తెలియచెయ్యగలవాడను.

ఇట్లు

మీ ప్రియమిత్రుడి సుపుత్రుడు..!

**- (అడుసుమిల్లి శ్రీనివాసరావు)**

# బీజేపీ అధ్యక్ష రేసులో మోదీ ప్రత్యర్థి జోషి?

మొదటి పేజీ తరువాయి..

దేదీప్యమానంగా వెలిగిపోతోంది.

గతంలో వాజపేయి, అద్వానీ, కుశభవ్‌ఠాక్రే, జనా కృష్ణమూర్తి, మురళీమనోహన్‌జోషి, వెంకయ్యనాయుడు, రాజ్‌నాథ్‌సింగ్ వంటి హేమాహేమీలున్నప్పటికీ.. వారికి సంఘ్ నిర్ణయమే శిలాశాసనం. కానీ మోదీ-షా ఢిల్లీ ప్రవేశంతో, సంఘ్ శైలి కూడా మారిపోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వారిద్దరి అభీష్టానికి భిన్నంగా, ఎవరూ బీజేపీ అధ్యక్షులయ్యే అవకాశం లేకుండా పోయింది. ఫలితంగా బీజేపీని సంఘ్ శాసిస్తుందా? సంఘ్ బీజేపీని శాసిస్తుందా? సంఘ్ పెద్దనా? మోదీషా పెద్దనా? అన్న సైద్ధాంతిక చర్చకు కారణమయింది.

ఈ క్రమంలో మోదీకి అప్పట్లో పార్టీలో బద్ధశత్రువైన సంజయ్‌జోషి, త్వరలో జరగనున్న బీజేపీ జాతీయ అధ్యక్ష పదవికి పోటీ చేయనున్నారన్న వార్తలు పార్టీ వర్గాల్లో ఆసక్తిని రేపుతున్నాయి. మోదీ అప్పట్లో గుజరాత్ బీజేపీ సంఘటనా మంత్రిగా పనిచేసిన రోజుల్లో, సీఎం అయిన కేశూభాయ్‌పటేల్‌ను మోదీ వ్యతిరేకించేవారు. ఆ దానితో సంఘ్ జోక్యం చేసుకుని, మోదీని ఢిల్లీకి పంపింది.

అంతకుముందు మోదీ.. 1993 నుంచి 1996 వరకూ, గుజరాత్ పార్టీ ఆర్గనైజింగ్ జనరల్ సెట్రరీగా పనిచేశారు. 1996లో ఆయనను సంఘ్, జాతీయ పార్టీ కార్యదర్శిగా పంపించింది. ఆ పదవిలో ఆయన 1998 వరకూ కొనసాగారు. సంఘ్ ఆదేశం మేరకు 2001లో మోదీ గుజరాత్ సీఎంగా వెళ్లారు. ఆ సమయంలో జోషి గుజరాత్ పార్టీ ఆర్గనైజింగ్ జనరల్ సెక్రటరీగా వెళ్లారు. అప్పుడే మోదీ-జోషి మధ్య సైద్ధాంతిక విభేధాలు తారాస్థాయికి చేరాయి. తన వ్యతిరేవర్గాన్ని జోషి ప్రోత్సహించడం మోదీకి నచ్చేదికాదు.

వారిద్దరిమధ్య ఘర్షణ వాతావరణం పెరగడంతో రంగంలోకి దిగిన సంఘ్ పెద్దలు, జోషిని జాతీయ పార్టీ ఆర్గనైజింగ్ జనరల్ సెక్రటరీగా పంపించింది. ఆరకంగా 43 ఏళ్లకే, జాతీయ సంఘటనా మహామంత్రి పదవి చేపట్టిన వారిలో ఆయనే ప్రథముడు. అయితే అక్కడ కూడా, జోషి నాటి గుజరాత్ సీఎం మోదీ వ్యతిరే వర్గాన్ని ప్రోత్సహించేవావారన్న విమర్శలుండేవి.

ఈ నేపథ్యంలో 2014 లోక్‌సభ ఎన్నికలు వచ్చాయి. అప్పటికే దేశంలో మోదీ ప్రభ వెలిగిపోతోంది. మీడియాలో ఆయన పేరు మార్మోగిపోతోంది. అన్ని రాష్ట్రాలూ గుజరాత్ వైపే చూసే పరిస్థితి. జాతీయ మీడియా సైతం మోదీని ఆకాశానికెత్తేసింది. జాతీయ స్థాయిలో సోనియాను ఎదుర్కొనే ఏకైక నేతగా, మోదీని ప్రచారంలో పెట్టింది. అటు హిందూ సంస్థలు సైతం.. మోదీ సారథ్యంలో భారతదేశం, హిందూదేశంగా ఆవిర్భవిస్తుందనే ప్రచారాన్ని మోతమోగించాయి. తొలిసారి మోదీ సారథ్యంలో, సోషల్‌మీడియాను బీజేపీ విస్తృతంగా వినియోగించుకుంది. దానితో బీజేపీ ఎన్నికల సారథ్యాన్ని సంఘ్ మోదీకి అప్పగించింది.

అయితే తాను ఆ బాధ్యతలు తీసుకోవాలన్నా, తర్వాత ప్రధాని బాధ్యతలు చేపట్టాలన్నా.. అప్పటి జాతీయ సంఘటనా మహామంత్రిగా ఉన్న, సంజయ్‌జోషిని తప్పించాలని మోదీ షరతు విధించారు. దానితో రంగంలోకి దిగిన సంఘ్ పెద్దలు.. జోషికి పరిస్థితి వివరించి, తప్పుకోవాలని సూచించారు. దానికి అంగీకరించిన జోషి, తనకు జాతీయ కార్యవర్గంలో స్థానం కల్పించాలని కోరగా, సంఘ్ అందుకు అంగీకరించింది. అయితే మోదీ దానికి సైతం అంగీకరించలేదు. అసలు జోషి పార్టీలోనే ఉండకూడ దని షరతు విధించారు.

అప్పటికే జోషిపై పార్టీలో అంతర్గతంగా “మానవ బలహీనతకు సంబంధించిన ఆరోపణ” అంశం బలంగా బిగిసుకుంది. కొద్దికాలం క్రితం బీజేపీలో వెలిగిన రాంమాధవ్ కూడా, అంతర్గతంగా ఇలాంటి ఆరోపణలు ఎదుర్కోవడంతో.. ఆయనను తప్పించాల్సి వచ్చిందన్న ప్రచారం పార్టీ వర్గాల్లో లేకపోలేదు. అయితే ఇవన్నీ.. పార్టీ వర్గాలకే పరిమితమైన రహస్యాలే తప్ప, బయట ప్రపంచానికి తెలిసినవి కాదు. సహజంగా సంఘ్ వ్యవహారాలు, మిగిలిన పార్టీల మాదిరిగా బయటకు రావు. కారణం సంఘ్ మీడియాకు దూరంగా ఉండటం, అసలు తెరపైకి రాకపోవడమే!

దానితో విధిలేక మీడియా ముందుకొచ్చిన జోషి, తనంతటతాను జాతీయ ఆర్గనైజింగ్ జనరల్ సెక్రటరీ బాధ్యతలనుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించాల్సి వచ్చింది. ఆ తర్వాతనే మోదీ.. పార్టీ జాతీయ ప్రచార కమిటీ చైర్మన్ బాధ్యతలు, తర్వాత ప్రధాని పదవి చేపట్టారు. ఇవన్నీ బీజేపీలో సుదీర్ఘకాలం నుంచి పనిచేస్తున్న సీనియర్లకు తెలిసినవే.తర్వాత పార్టీ నుంచి బయటకు వచ్చిన జోషి, ఢిల్లీలోనే ఉంటూ మోదీ వ్యతిరేక శిబిరం నడిపారన్న ఆరోపణలు లేకపోలేదు. జోషికి సమర్థవంతుడైన నాయకుడన్న పేరుంది.

అయితే ఇన్నేళ్ల తర్వాత మళ్లీ సంజయ్‌జోషి పేరు, అధ్యక్ష పదవికి తెరపైకి రావడం పార్టీవర్గాలను ఆశ్చర్య పరుస్తోంది. గత కొద్దిరోజుల నుంచి ఢిల్లీలో జోషి పేరు మళ్లీ చర్చకు వస్తోంది. సమర్థుడైన ఆర్గనైజర్‌గా పేరున్న జోషి ఒకవేళ అధ్యక్షుడైతే, పార్టీలో మోదీ-షా హవాకు తెరపడినట్లేనన్న వ్యాఖ్యలు అప్పుడే మొదలవడం విశేషం.

అయితే ఇప్పుడున్న పరిస్థితితో జోషి రావడం అసంభవమని, మరికొందరు సీనియర్లు చెబుతున్నారు. అసలు జోషికి ఎంట్రీనే కష్టమంటున్నారు. మోదీ-అమిత్‌షాకు ఎవరైతే అనుకూలంగా పనిచేస్తారో.. వారే అధ్యక్షులవుతారన్నది వారి వాదన.

అయితే ఒకప్పుడు మోదీ-జోషి మంచి మిత్రులని, 1995లో గుజరాత్‌లో బీజేపీ అధికారంలోకి రావడానికి, వారిద్దరూ పడిన కష్టమే కారణమని బీజేపీ సీనియర్లు గుర్తు చేస్తున్నారు. ఆ తర్వాత వచ్చిన విబేధాలే వారిద్దరి మధ్య శత్రుత్వం పెంచాయంటున్నారు.

‘ఇప్పుడు జోషి మళ్లీ తెరపైకి వస్తున్నారన్న ప్రచారం ఢిల్లీలో బాగా ఊపందుకుంది. అదే నిజమైతే మోదీ అందుకు అంగీకరించి ఉండాలి. సంఘ్ పెద్దలు వారిద్దరి మధ్య సఖ్యత కుదర్చి ఉండాలి. లేకపోతే జోషి ప్రవేశం అంత సులభంగా జరగద’ని సంఘ్ సీనియర్ నాయకుడొకరు వాఖ్యానించారు.

కాగా దేశంలో నెలకొన్న రాజకీయాలు, గత లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ బలం తగ్గడం, వివిధ రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్ బలం పెరుగుతున్న నేపథ్యంలో.. పార్టీలో ఇక వ్యక్తిస్వామ్యానికి తెరదించాలని, ఇటీవల చత్తీస్‌గఢ్‌లో జరిగిన సంఘ్ కీలక భేటీలో నిర్ణయం తీసు కుంది. బహుశా అందులో భాగంగానే, సంఘ్ విధే యుడైన సంజయ్ జోషి పేరు తెరపైకి వచ్చి ఉండ వచ్చంటున్నారు. సంఘ్ ప్రమేయం-అనుమతి లేనిదే జోషి పేరు తెరపైకి రావటం అసంభవమంటున్నారు.

సంఘ్ ఎవరి ప్రాధాన్యతను ఎప్పుడు తగ్గిస్తుందో, ఎప్పుడు పెంచుతుందో ఎవరి ఊహకు అందదు. ఏడాది క్రితం వరకూ బీజేపీలో ఒక వెలుగువెలిగి, ట్రబుల్ షూటర్‌గా పేరున్న సీనియర్ ప్రచారక్ రాంమాధవ్‌ను.. ఒకదశలో విదేశాంగశాఖమంత్రిగా నియమిస్తారన్న ప్రచారం జరిగింది. కానీ హటాత్తుగా ఆయన ప్రాధాన్యతను దారుణంగా తగ్గించి, తిరిగి సంఘ్‌కు పంపించేసిన వైనాన్ని సీనియర్లు గుర్తు చేస్తున్నారు.

మోదీ-షాతో సరిపడని క్రమంలోనే ఆయన ప్రాధాన్యం తగ్గించారన్న ప్రచారం జరిగింది. అయితే సుదీర్ఘ విరామానంతరం..ఇటీవలి జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు రాంమాధవ్‌ను ఇన్చార్జిగా పంపించారు. ఆయనతోపాటు ఒకప్పుడు సమానంగా వెలిగి, బీజేపీలో చక్రం తిప్పిన మరో సీనియర్ ప్రచారక్ బాగయ్య ప్రాధాన్యతను కూడా ఒకేసారి తగ్గించారు.

పురందేశ్వరికి అధ్యక్ష పదవి వచ్చేందుకు ఆయనే కారణమన్న ప్రచారం కూడా అప్పట్లో జరిగింది. ఆయన ఒక వర్గాన్ని విపరీతంగా ద్వేషించేవారని, ఆయన వల్ల ఆ వర్గానికి చెందిన చాలామంది సీనియర్లకు ప్రధాన్యం దగ్గకుండా పోయిందన్న విమర్శలు కూడా లేకపోలేదు. ఈ పరిణామాలు పరిశీలిస్తే.. సంజయ్ జోషిని తిరిగి తెరపైకి తీసుకువచ్చినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదంటున్నారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

3

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || సోమవారం 14, అక్టోబర్ 2024 ||


## డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిసిన చీరాల ఎమ్మెల్యే

**దర్శి, మహానాడు:** తెలుగుదేశం పార్టీ(టీడీపీ) ప్రకాశం జిల్లా, దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, టీడీపీ యువ నేత డాక్టర్ కడియాల లలిత్ సాగర్, ప్రముఖ వైద్యులు డాక్టర్ వెంకటేశ్వర రావు, రమేష్ బాబుని ఆదివారం లక్ష్మి నివాసంలో చీరాల శాసన సభ్యుడు ఎం.ఎం. కొండయ్య మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.

ఈ సందర్భంగా పలు రాజకీయ అంశాలపై చర్చించారు. నాలుగు నెలల కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వంగా ప్రజలకు చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలపై సుదీర్ఘంగా చర్చించారు. భవిష్యత్ రాజకీయాలు, ప్రకాశం జిల్లా సమగ్ర అభివృద్ధి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంపై వీరు మధ్య చర్చ జరిగింది. రాజకీయాలతో పాటు వైద్యురాలిగా పేదలకు సేవలందిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిని ఎమ్మెల్యే కొండయ్య అభినందించారు.





గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదివారం ఉదయం లాడ్జి సెంటర్‌లో జరిగిన ఇండియా పోస్ట్ రన్ అనే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి, జెండా ఊపి రన్ ప్రారంభించారు.



తెలుగుదేశం పార్టీ(టీడీపీ) పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మలపాటి శ్రీధర్ సోదరుడు శ్రీనివాసరావు కాలం చేశారు. వారి కుటుంబ సభ్యులను పెదకూరపాడు నియోజకవర్గ శాసన సభ్యుడు భాష్యం ప్రవీణ్ ఆదివారం పరామర్శించారు.



విదేశాల్లో ఉన్న తన మనవడు హిమాన్షుతో వీడియో కాల్‌లో మాట్లాడిన కేసిఆర్, కేటీఆర్, కేటీఆర్ కూతురు.

## పార్టీల ప్రచార సాధనాలను.... మీడియాగా గుర్తించవచ్చా !?

"పెన్ ఈజ్ మైటీయర్ ద్యాన్ స్వార్డ్"

Pen is mightier than sword"

అనే కొటేషన్ ను మనం ఎప్పుడో ఒకప్పుడు వినే ఉంటాం. అంటే –" కత్తి కంటే కలం గొప్ప..." అని .

కత్తి తీసుకుని జనం మీద పడితే మాచర్ల వరకే భయపడతారు .అదే కలం పట్టుకుంటే ....దానికి ఎల్లలు ఉండవు. ఆ కలం పోరంబోకుల చేతిలో ఉంటే....!?

పోరంబోకుల చేతికి కలం చిక్కితే, కత్తి కంటే ప్రమాదకరమని 185 సంవత్సరాల క్రితమే ఎడ్వర్డ్ లిట్టన్ అనే బ్రిటిష్ నవలా కారుడు, తన నవల – 'కుట్ర 'లో ఒక పాత్రతో పలికించాడు .

దానితో ఈ సామెత ప్రపంచవ్యాప్తమై పోయింది .



185 సంవత్సరాల (1839) క్రితమే, కలానికి అంత పవర్ ఉంటేబీ ప్రస్తుత మీడియా విస్పోటనంలో ఇంకెంత పవర్ ఉంటుంది ? ఊహకు సైతం అందనంత పవర్ కదా !

మీడియా ప్రభావం పెరిగింది . ప్రపంచ మీడియా మొత్తం వేయి జడలు విరబోసుకుని అరచేతిలోకి వచ్చింది .

చదువు రాని వారిని, చదువు సంధ్యలు లేని వారిని సైతం అమితంగా ప్రభావితం చేస్తున్నది . ఒక ఆటంబాంబు వేస్తే , వేసిన చోట కొన్ని కిలోమీటర్ల దూరంలోనే విధ్వంసం చోటుచేసు కుంటుంది. కానీ, ఒకరాత పూర్వక పుకారు....మొత్తం ప్రపంచాన్నే అతలాకుతలం చేసి పారేస్తుంది .

అందుకే, నాయకావతారాలు ఎత్తిన కొందరు తెలివైన పిండాలు..

తమ రాజకీయ ప్రత్యర్థుల మీద బురద , పేడ, అశుద్ధం వగైరా జల్లడానికి పత్రికలు , టీవీ ఛానెళ్లు పెట్టుకుంటారు ..

వారికంటే ఘనులను ....ఆ సంస్థలలో బురద జల్లే పనికి పెట్టుకుంటారు .

ఇక, చూస్కోండి......

ఇలా తమ తమ యాజమాన్యాలలో పత్రికలు, న్యూస్ చానెళ్ళ పెట్టుకున్నవారు .... ఈ రాత గాళ్లను, కూత గాళ్ళను దేశం మీదకు వదులుతుంటారు .

వీరికి వాస్తవాలతో పని లేదు. రాతలు ....కూతలలో సభ్యత , సంస్కారాలతో పని లేదు. తమ యాజమానుల రాజకీయ ప్రత్యర్థులపై ఎంత అశుద్ధం చిలకరించామన్నదే క్రైటీరియా.

వీరిని కూడా జర్నలిస్ట్‌గా పరిగణిస్తున్నారు .

వీరికీ అక్రిడిటేషన్ లు ఇస్తున్నారు. బస్ పాస్ లు ఇస్తున్నారు. ఇళ్ల స్థలాలు ఇస్తున్నారు . అధికార ప్రెస్ మీట్లకు పిలుస్తున్నారు. సచివాలయం, జిల్లా కలెక్టర్ ప్రెస్ మీట్లు ,ప్రభుత్వ కార్యాలయాలు, పోలీసు ప్రెస్ మీట్లు మొదలైన అన్ని ప్రభుత్వ కార్యకలాపాలకు ....కొత్త పెళ్లి కొడుకుల్లా ముందుకు ముందు హాజరవుతుంటారు.

తమ యజమానులకు మైలేజ్ ఇచ్చే ప్రశ్నలు అడుగుతుంటారు . వారు అడిగే ప్రశ్నల తీరు తెన్నులను బట్టి చెప్పేయవచ్చు ఆ ప్రశ్న వేయడం వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటో!

పాలల్లోంచి నీటిని వేరు చేసినట్టు , ఈ "ఫేక్ మీడియా " ను మీడియాను వేరు చేయాల్సిన అవసరం ఉంది. ఈ ఫేక్ మీడియా కు దాని యజమాని ప్రయోజనాలు ముఖ్యం . తన యజమాని ప్రత్యర్థుల "వ్యక్తిత్వ హననం " ముఖ్యం . ఇందు కోసం ఎన్ని అసత్యాలు ,దారుణ కథనాలు జనం మీదకు వదలడానికైనా ఈ" ఫేక్ మీడియా" వెనుకాడదు . తమ యజమాని ప్రత్యర్థులకు వ్యతిరేకం గా "పబ్లిక్ ఒపీనియన్ " ను విషతుల్యం చేయడమే ఈ " ఫేక్ మీడియా " ఏకైక లక్ష్యం . ఈ లక్ష్య సాధన లో సాక్షాత్తు శ్రీ వేంకటేశ్వర స్వామి అడ్డు వచ్చినా కేర్ చెయ్యరు .


ఇటువంటి "సమాచారఫ్యాక్టరీ"లలో రేయింబవళ్ళు అసత్యాలు ఉత్పత్తి చేస్తూ జనం మీదకు వదిలే" పని "లో ఉన్న వారికి ....ప్రభుత్వ మర్యాదలేమిటి ? అక్రిడిటేషన్లు ఏమిటి? బస్ పాస్ లు ఏమిటి ? ఇళ్ల స్థలాలు ఏమిటి? పోలీసు స్టేషన్ స్థాయి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రెస్ మీట్ స్థాయి వరకు వీరికి ఆహ్వానాలు , స్వాగత సత్కారాలు ఏమిటి?

వారు చిమ్మదలుచుకున్న "సమాచార విషం " ఎటుదిరిగీ చిమ్ముతారు. ఆ మాత్రం దానికి ....వారికి అతిథి మర్యాదలు ఎందుకు?

దీనినే " డబ్బులు ఇచ్చి తన్నించు కోవడం " అంటారు .

"మీడియా "ముసుగులో జనం ఆలోచనలను కలుషితం చేసే ఇటువంటి సంస్థలు ....ప్రభుత్వాలు విడుదల చేసే ప్రకటనల పై ఆధార పడవు. అందువల్ల బీ "ఫేక్ మీడియా "గా ప్రభుత్వం నోటిఫై చేసి, ప్రభుత్వ ప్రకటనలను కూడా వాటికి ఉపసంహరిం చాల్సిన అవసరం ఉంది.

"ఫేక్ మీడియా"పై "తగిన" చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం నీళ్ళు నమిలినా, మెతక వైఖరి అవలంభించినా," వాళ్ళ పాపాన వాళ్ళే పోతారులే" అనుకున్నా..... వాళ్ళ పాపాన వాళ్ళు పోరు. సమాజం పోతుంది .మంచి రాజకీయాలు పోతాయి . మంచిరాజకీయ నేతలు పోతారు.



- భోగాది వేంకట రాయుడు

# పోలీసు వ్యవస్థపై జనంలో నమ్మకం ఉంటుందా?

- ఏమి చేయలేకపోతే ఈ పోలీసు వ్యవస్థపై సాధారణ ప్రజలకు నమ్మకం ఉంటుందా?
- విజయ్ పాల్‌ను తక్షణమే అరెస్టు చేసి విచారణకు సహకరించడం లేదని సుప్రీంకోర్టుకు నివేదించాలి
- ఈ కేసులోని పెద్ద తలకాయలు కూడా సుప్రీంకోర్టును ఆశ్రయిస్తారా ?, లేకపోతే విజయ్ పాల్ పేర్లు చెప్పే వరకు వేచి చూస్తారా?
- ఎన్నో అరాచకాలను చేసిన సునీల్ కుమార్ అండ్ గ్యాంగ్
- ఒక పారిశ్రామికవేత్తను హింసించి డబ్బులను వసూలు చేసింది నిజం కాదా?
- గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి మాజీ సూపరింటెంట్ ప్రభావతి కొడుకుకు అవుట్ ఆఫ్ ది వే లో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాన్ని ఇవ్వలేదా?
- విజయ్ పాల్‌కు ఏడాది పొడిగింపు ఎందుకు..?
- ఉండి నియోజకవర్గ అభివృద్ధి కోసం రాజ్యసభ మాజీ సభ్యులు బీద మస్తాన్ రావు కోటి రూపాయల విరాళం
- ఉండి శాసనసభ్యులు రఘురామకృష్ణంరాజు

**ఉండి,మహానాడు:**

నన్ను లాకప్‌లో చిత్రహింసలకు గురిచేసిన కేసులో ప్రధాన నిందితుడైన రిటైర్డ్ పోలీస్ అధికారి విజయ్ పాల్ సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా విచారణకు సహ కరించనందుకు తక్షణమే అతడిని అరెస్టు చేయాలని ఉండి శాసనసభ్యులు రఘురామకృష్ణం రాజు సూచించారు. విజయ్ పాల్‌ను పోలీసులు అరెస్టు చేసి విచారణకు సహకరించడం లేదని సుప్రీంకోర్టులో మెమో దాఖలు చేయాలన్నారు.

సుప్రీంకోర్టు కల్పించిన రక్షణను విజయ్ పాల్ దుర్వినియోగం చేశాడని, కోర్టు ఆదేశాలను ధిక్కరించిన వ్యక్తిని తక్షణమే అరెస్టు చేసి కోర్టులో మెమో దాఖలు చేయవచ్చునని పలువురు న్యాయ కోవిదులు చెప్పారన్నారు. ఉండి నియోజకవర్గ కేంద్రంలో రఘురామకృష్ణం రాజు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ... విజయ్ పాల్ ను విచారించే సమయంలో పోలీసులు వీడియో రికార్డు చేసి ఉంటారని, విచారణకు ఆయన ఏమాత్రం సహకరించడం లేదన్న ఆధారాలను సుప్రీంకోర్టు కు నివేదించాలన్నారు.

లాకప్‌లో నన్ను చిత్రహింసలకు గురిచేసిన కేసులో ప్రధాన నిందితుడైన విజయ్ పాల్ ఎట్టకేలకు పోలీసుల ముందు విచారణకు హాజరయ్యాడన్నారు. ముందస్తు బెయిల్ కోసం హైకోర్టుకు వెళితే విజయ్ పాల్ ను పని చూసుకోమ్మంటే... సుప్రీంకోర్టును ఆశ్రయించగా అరెస్టు చేయవద్దని రక్షణ కల్పించిందన్నారు. పోలీసు విచారణకు సహకరించాలని విజయ్ పాల్‌ను ఆదేశించిందని గుర్తు చేశారు.

మూడు నెలల పాటు తప్పించుకొని తిరిగిన విజయ్ పాల్‌ను పోలీసులకు పట్టుకోవడం చేతకాక పోవడంతో... జాలేసి అతడే విచారణకు రమ్మంటారా? ఏంటి? అని అడిగి శుక్రవారం సాయంత్రం మూడు గంటలకు విచారణకు హాజరయ్యాడన్నారు. మూడు గంటల పాటు కొనసాగిన పోలీసు విచారణకు విజయ్ పాల్ ఏమాత్రం సహకరించలేదని ఈరోజు పత్రిక కథనాల ద్వారా స్పష్టమవుతుంది.

నాకేమీ గుర్తులేదు. నాకు వయసు అయిపోయింది. వయసయి పోతేనే రిటైర్ అయిపోతారు కదా? అంటూ విచారణ అధికారినే ఎదురు ప్రశ్నించినట్లు తెలిసింది. ఎక్కడకెళ్ళావు అని విచారణ అధికారి ప్రశ్నించగా అది నా వ్యక్తిగతం... ఎక్కడకు వెళితే మీకేంటి? అని ఎదురు ప్రశ్నించినట్లు తెలిసింది. సెల్ ఫోన్ ఎందుకు స్విచ్ ఆఫ్ చేశావని ప్రశ్నించగా, రిటైర్ అయినటువంటి వ్యక్తికి సెల్ ఫోన్ తో పనేంటి అని ఎదురు ప్రశ్నించినట్టుగా తెలిసింది.

లాకప్ బయట సెంట్రీలుగా విధులు నిర్వహించిన పోలీసు సిబ్బంది ఇచ్చిన వాంగ్మూలం గురించి ప్రస్తావించగా, తనకేమీ తెలియదని ... అంతా మరిచిపోయానని చెప్పినట్లుగా తెలిసింది. విజయ్ పాల్‌కు సడెన్‌గా మతి మరుపు వ్యాధి వచ్చినట్టుగా ఉందని రఘురామకృష్ణం రాజు అన్నారు. ఒక కేసులో ఇన్వెస్టిగేషన్ అధికారి అయిన విజయ్ పాల్ ఇప్పుడు సంబంధం లేనట్లుగా, ఏమీ జరగనట్లుగా మాట్లాడడం హాస్యాస్పదంగా ఉంది.

ఈ కేసులో ఇతరులు ఇచ్చిన సాక్ష్యాలను చూపెట్టినప్పుడు నాకసలు ఏమీ గుర్తులేదనడం విడ్డూరంగా ఉంది. ఏమైనా చెప్పాలనుకుంటే కోర్టులోనే చెబుతాను. మీకు ఏమీ చెప్పాల్సిన అవసరం లేదని ఒక రిటైర్డ్ పోలీస్ అధికారి, డర్టీ క్రిమినల్ కంటే హీనంగా మాట్లాడడం ఆశ్చర్యంగా ఉంది. మతిమరుపు ఉన్నట్టు నటిస్తున్న విజయ్‌పాల్‌ను వెంటనే పోలీసులు అదుపులోకి తీసుకోవాలి. పోలీసు విచారణకు సహకరించడం లేదని, సుప్రీంకోర్టుకు నివేదించాలి. నేను గజిని... నాకేమీ గుర్తు లేదు, తెలియదని మాట్లాడడం నీచాతి నీచమని రఘురామకృష్ణం రాజు మండిపడ్డారు.

### గతంలో ఉన్న వారు ఎఫెక్టివ్ పోలీసులు... ఇప్పుడున్న పోలీసులు డిఫెక్టివ్ పోలీసులా?

లాకప్‌లో నన్ను చిత్రహింసలకు గురిచేసిన కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తర్వాత కూడా మూడు నెలల పాటు తప్పించుకొని తిరిగిన విజయ్ పాల్ ను కనిపెట్టి అదుపులోకి తీసుకోలేకపోయినా, ప్రస్తుత పోలీసులు డిఫెక్టివ్ పోలీసులు... గతంలో ఎక్కడ ఉన్నా మమ్మల్ని గుర్తించి అరెస్టు చేసిన పోలీసులు ఎఫెక్టివ్ పోలీసులా అంటూ రఘురామకృష్ణంరాజు ప్రశ్నించారు.

మూడు నెలలు విజయ్ పాల్ తప్పించుకొని తిరిగిన అతడిని అరెస్టు చేయకపోవడం పరిశీలిస్తే, పోలీసుల సత్తా ఏమిటో తెలుస్తోందన్నారు. కాదంబరి జత్వాని కేసులో ఐపీఎస్ అధికారి విశాల్ గున్ని అప్రూవర్ గా మారిపోయి, కేసు నుంచి బయటపడ్డాడు. అలాగే లాకప్ చిత్రహింసల కేసులో విజయ్ పాల్ కూడా అప్రూవర్ గా మారితే ఈ కేసు నుంచి బయటపడతాడు. సాక్షులు ఇచ్చిన వాంగ్మూలాన్ని చూపెడితే గుర్తులేదని విజయ్ పాల్ డ్రామాలాడడం ఎవర్ని కాపాడడం కోసమని రఘురామ కృష్ణంరాజు ప్రశ్నించారు.

ఈ డ్రామాలు క్లైమాక్స్ కు వచ్చాయని అనుకుంటున్నానని తెలిపారు. ఈ కేసులో ఉన్న ఇద్దరు పెద్ద తలకాయలు ముందుగానే బెయిల్ కోసం సుప్రీం కోర్టును ఆశ్రయిస్తారేమో చూడాలన్నారు. లేకపోతే విజయ్ పాల్ విచారణలో తమ పేర్లు చెప్పే వరకు వేచి చూస్తారేమోనని అన్నారు. విజయ్ పాల్ పై తీవ్రమైన ఒత్తిడి ఉందన్న రఘురామకృష్ణం రాజు, లాకప్ లో నన్ను చితక్కొట్టారు. చితక్కొట్టామని చెప్పడానికి ఏంటి ఇబ్బంది అని ప్రశ్నించారు. తప్పని అప్పుడు తెలియదా? అంటూ నిలదీశారు.

అత్యంత నీచంగా, క్రూరంగా, కిరాతకంగా, ఆటవికంగా, అమానుషంగా వ్యవహరించారన్నది నిజం. ఆధారాలన్నీ ఉన్నాయి. లాకప్ లో నన్ను చిత్రహింసలకు













గురిచేసిన గదికి RRR గది అని పేరు పెట్టి, ఇతరులను సునీల్ కుమార్ అండ్ గ్యాంగ్ బెదిరించారు. ఒక పారిశ్రామికవేత్తకు ఫోన్ చేసి నీకు కూడా RRR ట్రీట్మెంట్ కావాలా? కానీ అడగడమే కాదు... అడిగినంత డబ్బులు ఇవ్వనందుకు, అతడిని చిత్రహింసలకు గురి చేసినట్లు తెలిసిందన్నారు.

టీవీ5 డిబేట్ కార్యక్రమంలో జర్నలిస్టు మూర్తి ఆ పారిశ్రామికవేత్త పేరు చెప్పకపోయినప్పటికీ, అందరూ నాలాగే పైకి చెప్పుకోలేరని, కొంతమంది అవమానంగా భావిస్తూ ఉంటారన్నారు. సునీల్ కుమార్, విజయ్ పాల్ గ్యాంగ్‌లో కొంతమంది ఏజెంట్లతో పాటు ఇద్దరు వైద్యులు ఉన్నారన్నారు. అవసరమైనప్పుడు ఈ వైద్యులు దొంగ వైద్య నివేదికలను ఇస్తారని తెలిపారు. డాక్టర్ చంద్రశేఖర్, ఇంకొక వైద్యుడు ఉన్నారన్న రఘురామకృష్ణంరాజు, ఇటువంటి తప్పుడు పనులు చేసినందుకే అవుట్ ఆఫ్ ది వేలో గుంటూరు ప్రభుత్వం మాజీ సూపరిండెంట్ ప్రభావతి కుమారుడికి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగం ఇచ్చారని తెలిపారు.

జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో ప్రభావతి కుమారుడికి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగం ఇచ్చారా? లేదా? అన్నదానిపై విచారణ జరిపించాలన్నారు. అలాగే విజయ్ పాల్‌కు ఒక ఏడాది పొడగింపు ఇచ్చారని వీటన్నింటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని రఘురామకృష్ణంరాజు కోరారు. ప్రభుత్వ పరిపాలన వ్యవహారంలో అక్రమాలకు పాల్పడిన వారిని ఉపేక్షించరాదన్నారు.

ఒక ఎంపీని లాకప్‌లో చిత్రహింసలకు గురిచేసిన కేసులో నాకేమీ గుర్తు లేదని, నేను మర్చిపోయాను అంటే ఈ పోలీసులు ఏమీ చేయకపోతే... పోలీసు వ్యవస్థ పై సాధారణ ప్రజలకు నమ్మకం ఉంటుందా? అని ప్రశ్నించిన రఘురామకృష్ణంరాజు ఉండే అవకాశమే లేదన్నారు.

గతంలో ఎంపీగా ఉన్న నేను ఇప్పుడు శాసన సభ్యుడిగా కొనసాగుతున్నాను. నన్ను అన్యాయంగా లాకప్ లో చిత్రహింసలకు గురి చేసిన వ్యక్తులను శిక్షించకపోతే, ఎవరికైనా న్యాయవ్యవస్థపై నమ్మకం ఉంటుందా?, ఆ నమ్మకాన్ని పునరుద్ధరించాలనే ప్రయత్నంలో భాగంగానే, రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడగానే పోలీసులకు ఫిర్యాదు చేశాను. ప్రభుత్వంపై కూడా ఒక రకంగా ఒత్తిడి తీసుకువచ్చాను. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

ఈ కేసు ను వాదించడానికి ప్రభుత్వం తమ తరపున సీనియర్ న్యాయవాదిని నియమించింది. నేను నా తరపున న్యాయవాదిని పెట్టుకున్నాను. ఈ సంఘటన ద్వారా తప్పు జరిగితే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహించరనే స్పష్టమైన సంకేతాలు ప్రజల్లోకి వెళ్లాయి. తప్పు జరిగితే పోలీసు వ్యవస్థ పని చేస్తుందన్న నమ్మకం కలిగింది. పోలీసుల చేత గత ప్రభుత్వ హయాంలో తప్పుడు పనులు చేయించారని, పోలీసులు స్వతహాగా పనికిరాని వారు కాదని రఘురామకృష్ణం రాజు తెలిపారు.

ఈ కేసులో అన్ని సాక్షాధారాలు ఉన్నాయి. మిలటరీ ఆసుపత్రి ఇచ్చిన వైద్య నివేదిక ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా పలుసభలు, సమావేశాలలో రఘురామ కృష్ణంరాజును లాకప్‌లో చిత్రహింసలకు గురి చేశారని పేర్కొన్నారు. అయినా ఇప్పుడు పోలీసు విచారణలో విజయ్ పాల్ నాకేమీ గుర్తులేదు... అన్నీ మర్చిపోయానంటే ఉపేక్షించరాదు. తప్పకచర్యలు తీసుకోవాలి. మళ్లీ సుప్రీంకోర్టు ఎప్పుడో పిలుస్తుంది. పిలిచినప్పుడు చెబుదాంలే అని కాకుండా, తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు.

విజయ్ పాల్ నా మైండ్ దొబ్బింది అంటే, మిగిలిన సాక్షుల సాక్షాన్ని ప్రామాణికంగా తీసుకొని ఈ కేసులో పోలీసులు ప్రొసీడ్ కావాలి. నువ్వు మర్చిపోయావు చిట్టి.. మతిమరుపు ఉన్నంత మాత్రాన శిక్ష శిక్షే. కేవలం తనని తాను కాపాడుకోవడానికి విజయ్ పాల్ మతిమరుపు నాటకాన్ని ఆడుతున్నాడని రఘురామ కృష్ణంరాజు తెలిపారు .

కాదంబరి జత్వాని కేసులో విశాల్ గున్ని చెప్పినట్లుగానే నిజాలను చెప్పి విజయ్ పాల్ ఈ కేసు నుండి బయట పడుతాడా లేదా చూడాలి. గజినీకి కూడా అప్పుడప్పుడు అన్నీ గుర్తుకు వస్తాయి. పోలీసులు మతిమరుపు వ్యాధిని నయం చేయడానికి విజయ్ పాల్ కు డాబర్ చవన్ ప్రాష్ తినిపించాలని, నిజంగానే బుర్ర దొబ్బితే, ఆ బుర్ర పనిచేయడానికి అవసరమైతే కస్టడీలోకి తీసుకొని సపర్యలను చేయాలన్నారు.

### డబ్బులున్నా కోటి రూపాయల విరాళం ఇవ్వడం ఆషామాషీ కాదు

డబ్బులు ఉన్నప్పటికీ కోటి రూపాయల విరాళం ఇవ్వడం అనేది అంతా ఆషామాషీ వ్యవహారం కాదని రఘురామ కృష్ణంరాజు అన్నారు. ఉండి నియోజకవర్గ అభివృద్ధి కోసం రాజ్యసభ మాజీ సభ్యులు బీద మస్తాన్ రావు కోటి రూపాయల విరాళం ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఉండి నియోజకవర్గ పరిధిలో బీద మస్తాన్ రావు కంపెనీకి చెందిన ప్రోడక్ట్ లాంచ్ కోసం ఆయన హాజరై, నియోజకవర్గ పరిధిలో జరిగిన కాలువలు, డ్రైన్లు, పంట కాలువల అభివృద్ధిని పరిశీలించి నియోజకవర్గ అభివృద్ధి కోసం తనవంతుగా కోటి రూపాయల విరాళాన్ని ఇస్తున్నట్లుగా ప్రకటించారని తెలిపారు.

### పెద మేరం, భీమవరం సర్కిల్‌లో రతన్ టాటా కాంస్య విగ్రహం

పెద మేరం, భీమవరం సర్కిల్లో దిగ్గజ పారిశ్రామికవేత్త, మానవతావాది రతన్ టాటా కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లుగా రఘురామకృష్ణంరాజు తెలిపారు. ఈ విగ్రహాన్ని మంత్రి నారా లోకేష్ చేతులమీదుగా ఆవిష్కరించనున్నట్లు వెల్లడించారు.

నారా లోకేష్ అమె రికా పర్యటనకు ముందే ఏర్పాట్లు పూర్తయితే వెంటనే ఆవిష్కరణ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు, ఒకవేళ ఆలస్య మైతే ఆయన అమెరికా నుంచి తిరిగి వచ్చిన తర్వాత విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నారా లోకేష్ కోరిక మేరకు, టిసిఎస్ ద్వారా పదివేల మందికి ఉపాధి కల్పించేందుకు టాటా సంస్థ చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

జనం గుండె చప్పుడు


# మహానాడు

4

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || సోమవారం 14, అక్టోబర్ 2024 ||

## సాయిబాబాగారితో నాకున్న అనుబంధం



ప్రొఫెసర్ జీ.నాగ సాయిబాబా గారు ఉస్మానియా యూనివర్సిటీ సమీపంలోని సీతాఫల్ మండీలో ఉన్నప్పుడు ఆయన నాకు ఇంగ్లీష్ పాఠాలు చెప్పారు! నాకొచ్చిన ఈ కొద్ది ఇంగ్లీష్ ఆయన, మా మేనమామ గార్ల చలవే!

సాయిబాబా గారు సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ [అప్పటి సీఫెల్ ఇప్పటి ఇఫ్లూ]లో మా మేనమామ టీ. శరత్ బాబు గారి క్లాస్ మెట్! ఇద్దరూ కలిసి పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ టీచింగ్ ఆఫ్ ఇంగ్లీష్ [పీజీడిటీఈ] కోర్సు చేశారు! సాయిబాబా గారు వారి సతీమణి వసంత గారితో కలిసి సీతాఫల్ మండీలో ఒక చిన్న పాత ఇంట్లో అద్దెకుండేవారు!

ప్రొఫెసర్ సాయిబాబా, వసంత గార్లకు మా మేనమామ శరత్ బాబు గారు, మరొకరు కలిసి సాక్షి సంతకాలు పెట్టి రిజిస్టర్ మ్యారేజ్ చేశారు! నేను ఢిల్లీలో ఉండగా ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియాలో ప్రొఫెసర్ సాయిబాబాని అప్పట్లో మళ్లా కలిసాను!

ఆయన ఆత్మ సద్గతులు పొందాలని నా ప్రార్థన!

**- సూరజ్ భరద్వాజ్**

## రాధాకృష్ణ.. మాకు నీతులు చెప్పకండి!



**శేఖర్‌రెడ్డికి అపాయింట్‌మెంట్ ఇప్పించింది ఎవరు?**

**'షిర్డిసాయి'పై మీ కలం ఎందుకు సరెండరయింది?**

**'మేఘ'పై మీ మౌనం వెనక మతలబేమిటి?**

**సోషల్ మీడియా వాళ్లకి ఎవడి బతుకేంటో తెలుసు**

*డియర్ ఏబీఎన్ ఆర్కే..*

బేరం పెట్టుకుని బ్యాకింగ్ ఇచ్చేవాళ్ళకి.. భవిష్యత్తు కోసం బ్యాకింగ్ ఇచ్చే వాళ్ళకి తేడా ఉంటుంది సారు.

కొన్ని విషయాలు మాట్లాడుకుందాము.


శేఖర్ రెడ్డికి అపాయింట్మెంట్ ఎవరు ఇప్పించారు? షిర్డీ సాయి మీద పుంఖాను పుంఖాలు రాసిన మీరు, ఎందుకు సైలెంట్ అయిపోయారు.. అప్పట్లో తప్పులు జరగలేదా?

మేఘ మీద కూడా ఇప్పుడు మీరు సైలెంట్. ఒకసారి మీరు ఎన్ని ఫేకు వార్తలు తిప్పుతున్నారో చూస్తున్నారా..

నిన్న విజయ్ పాల్ అప్రూవర్‌గా మారాడు అని మీ టీవీలో తిప్పి.. అదే వార్త మీ మెయిన్ పేపర్‌లో వేరేగా రాశారు.

మొదటి నుంచి సోషల్ మీడియా మీద మీ condescending ఆటిట్యూడ్ మారలేదు. మేము మిమ్మల్ని పెద్దగా పట్టించుకోము.

ఎందుకంటే మీ mainstream మీడియా వాళ్లకి కంటే .. సోషల్ మీడియా వాళ్లకి ఎవడి బతుకేంటో తెలుసు. మీకు ఊరికి ఒక రిపోర్టర్ వుంటాడేమో! మా social media వాళ్ళు ఇంటికి ఒకడు ఉంటాడు .. మీకన్నా ఎక్కువ ఇన్ఫర్మేషన్ మా దగ్గర వుంటుంది. మాకు నీతులు చెప్పకండి.



**- సతీష్ చాగంటి**

## రేపటి నుంచి 'ప్రజావేదిక'లో ఉండే మంత్రుల వివరాలు

- **నేటి కార్యక్రమం రద్దు**

**మంగళగిరి, మహానాడు:** ఇక్కడి తెలుగుదేశం పార్టీ(టీడీపీ) కేంద్ర కార్యాలయంలో "ప్రజా వేదిక" కార్యక్రమంలో పాల్గొననున్న మంత్రులు, నాయకుల షెడ్యూల్ ను పార్టీ శాసన మండలి సభ్యులు, కేంద్ర కార్యాలయం కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు ఆదివారం విడుదల చేశారు.

తెలుగుదేశం పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలనుశారం మంగళగిరి ఎన్టీఆర్ భవన్‌లో "ప్రజా వేదిక" కార్యక్రమం జరుగుతోంది. 2024 అక్టోబరు 15 నుంచి నుండి ప్రజావేదిక కార్యక్రమంలో మంత్రులు, పార్టీ నాయకులు పాల్గొంటున్నారు. పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటారు. ప్రజల వద్ద నుండి వారు అర్జీలు స్వీకరిస్తారు. 14వ తేదీ సోమవారం "పల్లె పండుగ" కార్యక్రమం జరుగుతున్న నేపథ్యంలో ఆ రోజు ఎటువంటి గ్రీవెన్స్ ఉండదు. తెలుగుదేశం పార్టీశ్రేణులు, ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

**ప్రజా వేదిక కార్యక్రమంలో పాల్గొననున్న మంత్రులు, నాయకుల షెడ్యూల్:**

15.10.2024: మంత్రి కొల్లు రవీంద్ర, టీడీపీ పార్లమెంట్ పార్టీ ప్రెసిడెంట్ గన్ని వీరంజినేయులు

16.10.2024: ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కెవిఎస్ జవహార్

17.10.2024: మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే శ్రీ శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య

18.10.2024: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ రావు యాదవ్, మంత్రి వంగలపూడి అనిత

19.10.2024: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ రావు యాదవ్, మంత్రి వాసంశెట్టి సుభాష్

21.10.2024: మంత్రి, కొలుసు పార్థసారథి, టీడీపీ పార్టీ ప్రాధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి

22.10.2024: మంత్రి ఎస్ సవిత, టీడీపీ పార్లమెంట్ పార్టీ ప్రెసిడెంట్ నెట్టం రఘురాం

23.10.2024: మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు

24.10.2024: మంత్రి టిజి భరత్, ఏపీటిడిసీ చైర్మన్ నూకసాని బాలాజీ

25.10.2024: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌రావుయాదవ్, మంత్రి గొట్టిపాటి రవికుమార్

26.10.2024: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌రావు యాదవ్, మంత్రి అనగాని సత్యప్రసాద్

28.10.2024: మంత్రి, డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి, టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డెప్పగారి శ్రీనివాస రెడ్డి


29.10.2024: మంత్రి కింజరాపు అచ్చెన్నా యుడు, ఏపీహెచ్సి చైర్మన్ బత్తుల తాతయ్య బాబు

30.10.2024: మంత్రి నిమ్మల రామా నాయుడు, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

31.10.2024: మంత్రి ఎన్ఎండి ఫరూక్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కంభంపాటి రామ్మోహన్ రావు

## ఇద్దరు మహిళలపై గ్యాంగ్‌రేప్ దుర్మార్గం

- **హిందూపురం గ్యాంగ్ రేప్‌పై మాజీ మంత్రి, శ్రీ సత్యసాయి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు ఉషా శ్రీ చరణ్**



**హిందూపురం,**

ఇద్దరు మహిళలపై గ్యాంగ్‌రేప్ అత్యంత దుర్మార్గం, విజయదశమి రోజు స్త్రీని పరాశక్తిగా కొలిచే ఈ దేశంలో ఇలాంటి ఘటన జరగడం చాలా బాధాకరం. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి మహిళలపై దాడులు, అఘాయిత్యాలు, అత్యాచారాలు పెరిగిపోయాయి

మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ చిత్తూరు జిల్లాలో బాలిక హత్యపై అక్కడికి వెళతారని ప్రకటించగానే హడావిడిగా మంత్రులు వెళ్ళారు, చిలమత్తూరు గ్యాంగ్‌రేప్ విషయంలో ప్రభుత్వం తక్షణం స్పందించాలి.

హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ, అనంతపురం జిల్లా మంత్రి సవిత, హోంమంత్రి అనిత ఇంతవరకు బాధితులను పరామర్శించలేదు, ఇంతకంటే దారుణం ఉంటుందా? మదనపల్లి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అగ్నిప్రమాదంపై అప్పటికప్పుడు హెలికాప్టర్‌లో ఉన్నతాధికారులను పంపిన ప్రభుత్వం ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉంది, ఈ గ్యాంగ్ రేప్‌పై కూడా అంతే స్థాయిలో స్పందించాలి.తక్షణమే నిందితులను పట్టుకుని బాధితులకు తగిన న్యాయం చేయాలని మేం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.



## సీఐడీకి టీడీపీ ఆఫీసుపై దాడి కేసు!

- **సర్కారు నిర్ణయం**



**అమరావతి, మహానాడు:** తెలుగుదేశం పార్టీ(టీడీపీ) కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసును సీఐడీకి బదలాయించాలని ఎన్డీయే సర్కారు నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం మంగళగిరి పీఎస్‌ల పరిధిలో కేసుల విచారణ జరుగుతోంది. కేసు తీవ్రత దృష్ట్యా, సీఐడీకి అప్పగించాలని నిర్ణయించింది. ఈ కేసులో ఇప్పటికే మాజీ ఎంపీ నందిగం సురేష్ జైలుకెళ్ళారు. ఇదే కేసులో సజ్జల, దేవినేని అవినాష్, లేళ్ల అప్పిరెడ్డిపై అభియోగాలు ఉన్నాయి.

### రానున్న నాలుగు రోజులు


## ఏపీలో భారీ వర్షాలు

- **విపత్తుల నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా**

**విజయవాడ, మహానాడు:** ఆగ్నేయ, నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనాలు ఏర్పడడంతో రానున్న నాలుగు రోజులు ఏపీలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, కొన్ని చోట్ల పిడుగులతో కూడిన వర్షం పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా ఆదివారం తెలిపారు. ఈ నెల 17 వరకు కోస్తా, రాయలసీమలో భారీవర్షాలు, తీరం వెంబడి 40 నుండి 55 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. ఈ దృష్ట్యా 24 గంటలు విపత్తు నిర్వహణ శాఖ అప్రమత్తంగా ఉండాలని, జిల్లా, రాష్ట్ర స్థాయిలో కంట్రోల్ రూమ్, హెల్ప్‌లైన్‌లు ఏర్పాటు చేసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అలాగే, ఏలూరు, ప్రకాశం, పశ్చిమగోదావరి, పల్నాడు, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మత్స్యకారులు వేటకు వెళ్ళవద్దు అని సిసోడియా హెచ్చరించారు.

## దుర్గమ్మకు మహి రసజ్ఞ నాట్యనీరాజనం


**విశాఖపట్నం, మహానాడు:** పురుషోత్తపురంలోని శ్రీ విజయ గణపతి ఆధ్యాత్మిక వేదికపై వర్ధమాన కూచిపూడి నృత్య కళాకారిణి చిట్టిమోజు మహి రసజ్ఞ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా నిర్వహించిన తన నృత్యాభినయంతో ఆహుతులైన భక్తుల్ని పరవశింపజేసింది. అందెల రవళిలు దివ్యనాదం వినవస్తుండగా తన నృత్త, నృత్య ప్రావీణ్యంతో భామాకలాపం... తాండవం అంశాలు నయన మనోహరంగా ప్రదర్శించి వీక్షకుల్ని మెప్పించి ప్రశంసలు అందుకుంది. నాట్యచార్యులు



ఆలూరి సోమేశ్వర ప్రసాద్ శిష్యరికంలో రాణిస్తున్న రసజ్ఞ భాగ్యనగరంలో ఇంజనీరింగ్( ద్వితీయ) విద్యార్థి కావడం విశేషం. ఉన్న ఊరు మీద మమకారంతో మాతామహుల ఇంటికి విచ్చేసిన ఆమె దుర్గమ్మకు నృత్య నీరాజనం ఘటించడం ప్రశంసనీయం.

## రాష్ట్ర గ్రంథాలయాలన్ని పరిశీలించిన పెమ్మసాని

**గుంటూరు, మహానాడు:** గ్రంథాలయాల్లో విద్యార్థులు, పాఠకులకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచాలి. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని రూరల్ డెవలప్



మెంట్, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సూచించారు.

గుంటూరులోని రాష్ట్ర గ్రంథాలయాన్ని స్థానిక ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, జనసేన నాయకులతో కలిసి పెమ్మసాని ఆదివారం పరిశీలించారు. గ్రంథాలయ భవనం శిథిలావస్థలో ఉండటాన్ని గమనించిన పెమ్మసాని భవన, నిర్వహణ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. శ్లాబ్‌లు పెచ్చులూడి వర్షాలకు నీటి చెమ్మ వస్తుందని గ్రంథాలయ అధికారులు పెమ్మసాని దృష్టి తీసుకొచ్చారు. గత ప్రభుత్వంలో కనీసం పేపర్లు, మ్యాగజైన్ల కొనుగోలుకు కూడా నిధులు కేటాయించకపోవడంతో పాఠకులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

### 'అమరావతి' కోసం

## దీక్షా బద్ధులు అవుదాం

- **డాక్టర్ మాదల శ్రీనివాసు**

**అమరావతి, మహానాడు:** అమరావతి నిర్మాణానికి ప్రధాని నరేంద్ర మోడీ శంకుస్థాపన చేసి ఈ విజయదశమికి తొమ్మిదేళ్ళు పూర్తయ్యాయి. ఈ కాలంలో ఏ లక్ష్యం కోసం రైతులు భూములు త్యాగం చేశారో, నాటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేశాయో ఆ అమరావతి నిర్మాణం కొరకు కుల, మత, వర్గ రాజకీయాలకు అతీతంగా, రాష్ట్ర ప్రజలంతా సమిష్టిగా కృషి చేశారని డాక్టర్ మాదల శ్రీనివాసు అన్నారు.



ఒక తల్లి నవమాసాలు మోసి పండంటి బిడ్డకు జన్మనిచ్చిన విధంగా మనమంతా అమరావతిని తొమ్మిదేళ్ళుగా కడుపున పెట్టుకుని కాపాడుకుంటున్నాం. ఇప్పుడు ఈ కష్ట ఫలితం దక్కాలంటే మనమంతా అదే స్ఫూర్తితో, సంయమనంతో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి కార్యాచరణను కుల, మత, వర్గ రాజకీయాలకు అతీతంగా ముందుకు తీసుకువెళ్ళవలసిన అవసరం ఉంది. మనమంతా కలిసి ఒక్కటిగా ముందుకు కదిలి రాగల రెండేళ్ళలో ఈ మహత్తర లక్ష్యాన్ని చేరుకోవటానికి ఈ పవిత్ర విజయదశమి సందర్భంగా దీక్షాబద్ధులు కావాల్సిందిగా మనవి.

## సంతోషంగా దసరా ఉత్సవాలు

- **కూటమి ప్రభుత్వం వచ్చాక తొలి దసరా ఇది**
- **సమిష్టి కృషి ఇంద్రకీలాద్రిపై ఉత్సవాలు విజయవంతం**
- **ఎమ్మెల్యే సుజనా చౌదరి**



**విజయవాడ, మహానాడు:**

స్థానిక ఎమ్మెల్యేగా ఇంద్రకీలాద్రిపై నా వంతు కర్తవ్యం నేను నిర్వర్తించా... సీపీ, కలెక్టర్, ఈవో సమన్వయం తో ఉత్సవాలు విజయవంతం చేయడం అభినందనీయం.. దేవాదాయ శాఖ మంత్రి కూడా ప్రతిరోజు ఏర్పాట్లు పరిశీలించి చర్యలు తీసుకున్నారు. చిన్న సమస్యలు తప్ప.. ఉత్సవాలు విజయవంతంగా జరగడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. ఈ మేరకు ఆయన మీడియాతో ఏమన్నారంటే.. ఎన్డీయే కూటమి ప్రభుత్వం వచ్చాక తొలి దసరా ఇది. ప్రజలు సంతోషంగా దసరా ఉత్సవాలు జరుపుకొన్నారు. కొన్ని లోపాలను గుర్తించాను... వచ్చే ఏడాది వాటిని పునరావృతం కాకుండా సరిచేస్తాం.. తాత్కాలిక ఏర్పాట్లు ప్రతి ఏడాది చేసి మళ్ళీ తొలగిస్తున్నారు. ఈసారి పర్మినెంట్ క్యూ లైన్ల తో పాటు కొన్ని శాశ్వత ఏర్పాటు చేసేందుకు ఆలోచన చేస్తున్నాం.

కొండపైకి అనవసర వాహనాలు కూడా ఆపడం వల్ల ఇబ్బందులు తొలగించాం. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం సూచనలు కూడా ఈ ఉత్సవాల విజయవంతంగా నిర్వహించేందుకు తోడ్పడ్డాయి. ఒకవైపు కొండ పైకి, మరో వైపు నుంచి కిందకి దిగేలా మార్గాలు ఏర్పాటుకు ఆలోచన చేస్తున్నాం. వచ్చే దసరా నాటికి మరింత పకడ్బందీగా ఏర్పాట్లు ఉంటాయి. సామాన్య భక్తులు ప్రశాంతంగా ఈసారి అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. ఎక్కడా ఎటువంటి గందరగోళం కొండపై లేకుండా ఉత్సవాలు ముగిశాయి.

అధికారులు, పాలకులు కూడా సమన్వయంతో పని చేశారు. వీఐపీ, వివిఐపి లకు స్లాట్ లు ఇచ్చి ఒక ప్రత్యేక సమయం కేటాయించడంతో భక్తులు రద్దీ ఉన్నా సామాన్య భక్తులకు ఇబ్బంది కలుగకుండా చూసాం. దుర్గగుడి అభివృద్ధి కి ఆ ప్రాంత ఎమ్మెల్యే గా నా వంతు కృషి చేస్తా.. సూచనలు, సలహాలు, అభిప్రాయాలను రాసి నాకు అందిస్తే వాటిని కూడా పరిగణలోకి తీసుకుంటాం.

## పంచాయతీలను దిష్టిబొమ్మలుగా మార్చిన వైసీపీ!

- **కూటమి పాలనలో నేటి నుండి 'పల్లె పండగ'**
- **టీడీపీ 'దర్శి' ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి**



**దర్శి, మహానాడు:**

వైసీపీ విధ్వంస పాలనలో పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యమైందని, గడిచిన ఐదేళ్లకాలంలో గ్రామ సీమలన్నీ ఎడారిని తలపించాయన్నాయని, కనీస సౌకర్యాలకు నోచుకోక దిష్టిబొమ్మలుగా తయారయ్యాయని తెలుగుదేశం పార్టీ(టీడీపీ) దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. గెలిచిన సర్పంచులు అభివృద్ధి చేయలేక, అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, పదిహేనో ఆర్థిక సంఘం నిధులను కూడా విద్యుత్ బిల్లుల సాకుతో పక్కదారి పట్టించారని, గ్రామపంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సంఘం నిధులను గత ప్రభుత్వం మింగేసిందని ఆరోపించారు. నేటి నుంచి పల్లె పండగ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆమె ఆదివారం విలేఖర్లతో మాట్లాడారు.

ఏ పనిచేపట్టేందుకు నిధులు లేక పాలకవర్గాలు మిన్నుకుండిపోయాయని లక్ష్మి పేర్కొన్నారు. సర్పంచల నిధులను జగన్ లాగేసుకున్నారని, ఏపీ వ్యాప్తంగా ఈ నెల 14వ తేదీ నుంచి పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహించనున్నారని, 13,324 గ్రామాల్లో ఒకేసారి పల్లెపండుగ వారోత్సవాలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో కనీస అవసరాలైన రోడ్లు, మురుగుకాలువలు, మంచినీటి వంటి సమస్యల పరిష్కారం కానున్నాయని చెప్పారు. దీంతో పల్లెల రూపురేఖలు మారనున్నాయని పేర్కొన్నారు.


## తొలి నుంచి తుది వరకూ అదే సిద్ధాంతం!



పీడిత, తాడిత ప్రజల గొంతుకై, పోరాటంతోనే పేద ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయనే సిద్ధాంతాన్ని నమ్మి. తన జీవిత కాలం అదే సిద్ధాంతంతో జీవించారు సాయిబాబా.

1998లో వరంగల్‌లో "ప్రజాస్వామిక తెలంగాణ– ప్రజల ఆకాంక్ష" పేరుతో ఆల్ ఇండియా పీపుల్స్ రెసిస్టన్స్ ఫోరమ్ AIPRF ఆధ్వర్యంలో వరంగల్‌లో రెండు రోజుల పాటు సదస్సు, రెండవ రోజు సాయంత్రం ములుగు రోడ్డు నుంచి హన్మకొండలోని JNS గ్రౌండ్స్ వరకు భారీ ర్యాలీ, బహిరంగ సభ (జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం, హన్మకొండ బస్ స్టాండ్ పక్కనే ఉంటుంది) భారీ బహిరంగ సభ.

1996లో గద్దర్ అన్న పై కాల్పులు జరిగిన తర్వాత. ఆయన ట్రీట్ మెంట్ తీసుకుని, మళ్లీ



బహిరంగ సభకు హాజరైన మొదటి బహిరంగ సభ అదే. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును కోరుకుంటూ అశేష జనం. వేలాది మంది తో బహిరంగ సభ.

గద్దర్ అన్న ఢిల్లీ నుంచి వరంగల్ కు రైలులో వస్తూ, తనపై తాను రాసుకున్న పాటే "నన్నుగన్న తల్లులారా....

తెలంగాణ పల్లెలారా.....

మీ పాటనై వస్తున్నానమ్మో మా అమ్మా లారా .... మీ పాదాలకు వందనాలమ్మో మా అమ్మలారా.. ఎడమ చేతిలో దిగిన తూటా ఎత్త మంది ఎర్ర జెండా.... వెన్నుపూసలో ఉన్నా తూటా అన్నా పదా పాడుదామంది...." ఈ విషయాన్ని గద్దర్ అన్నే ఆ బహిరంగ సభలో వేలాది మంది సమక్షంలో చెప్పారు.

ఆ మొత్తం రెండు రోజుల సదస్సు, బహిరంగ సభ ఏర్పాటును కోఆర్డినేట్ చేసిన కొంత మంది ముఖ్యుల్లో సాయిబాబా గారు ఒకరు. AIPRF ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో, సాయిబాబా గారు ఆ బాధ్యతను భుజాలపై వేసుకున్నారు.

నేను జర్నలిస్టుగా ఆ రెండు రోజుల సదస్సు, బహిరంగ సభను కవర్ చేయడానికి వెళ్ళాను. అలా సాయిబాబా గారితో నాకు పరిచయం. అప్పటి నుంచి మా అనుబంధం కొనసాగుతూనే వచ్చింది. ఇంకా చాలా సందర్భాలు ఉన్నాయి. కానీ వాటన్నిటినీ ఇక్కడ ప్రస్తుతం పంచుకోలేను.



**- రమణకుమార్**

**"అలాయ్ బలాయ్" కార్యక్రమానికి హర్యానా ముఖ్యమంత్రి తరపున హాజరైన హర్యాన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి టి.వి.ఎస్.ఎన్ ప్రసాద్**



జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || సోమవారం 14, అక్టోబర్ 2024 ||



## మరిన్ని కొత్త బస్సులు తెస్తాం

**- ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు**

**నరసరావుపేట, మహానాడు:** ప్రయాణికుల సౌకర్యార్థం నరసరావుపేట ఆర్టీసీ డిపో నుంచి మరిన్ని కొత్త బస్సు సర్వీసులు నడిపేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఆయన రెండు నూతన బస్సులను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.... రానున్న రోజుల్లో మరిన్ని కొత్త భక్తులు తీసుకొస్తామన్నారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆర్టీసీ అధికారులను కోరారు. ప్రయాణికులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఆర్టీసీ బస్సులు నడపాలని, ఇబ్బందులు లేకుండా నిత్యం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ఎన్డీఏ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కృషి చేస్తుందని



వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు.. ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.



## ఏడాదిలోపు రామలింగేశ్వర స్వామి గుడికి ఘాట్ రోడ్డు

◆ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

**వినుకొండ, మహానాడు:**

వినుకొండపై కొలువైన రామలింగేశ్వర స్వామి గుడికి ఏడాదిలోపు ఘాట్ రోడ్ నిర్మాణం పూర్తి చేస్తామని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు హామీ ఇచ్చారు. అందుకు కావాల్సిన నిధులను మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. స్థానికులు, దాతలు సహకరిస్తే ఆ ఆలయాన్ని మరిన్ని సౌకర్యాలతో అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకోవచ్చన్నారు.

వినుకొండ బోసు బొమ్మ సెంటర్‌లోని శ్రీ సమర్థ సద్గురు షిర్డీ సాయి బాబా 64వ ఆరాధన మహోత్సవాల్లో ఆదివారం ఎమ్మెల్యే.. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావుతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అక్కడ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీవీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం మాట్లాడిన ఎమ్మెల్యే సీతారాముల కల్యాణం కన్నులవిందుగా నిర్వహిస్తున్న బ్రాహ్మణులు, కమిటీకి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

గత ప్రభుత్వంలో రూపాయి ఇవ్వలేదని, ఇటీవల ముఖ్యమంత్రి చంద్ర బాబును అడగగానే గుడి కోసం రూ.2 కోట్లు ఇచ్చారని తెలిపారు. ఘాట్ రోడ్డు నిర్మాణం పూర్తి కోసం నిధులు అడగ్గానే 9, 10 ఎన్ని కోట్లయినా ఇవ్వమని అధికారులను ఆదేశించారని సంతోషం వ్యక్తం చేశారు. వినుకొండలో టీటీడీ కల్యాణ మండపానికి అడగ్గానే సీఎం రూ. 3 కోట్లు ఇచ్చారన్నారు. త్వరలోనే తితిదే నుంచి పెద్ద కల్యాణ మండపం పూర్తి చేసుకుంటామన్నారు.

కొండమీదకు మెట్లదారికి తనవంతు ఆర్థిక సాయం చేస్తానని, పెద్దలు ముందుకు వచ్చి తలా నాలుగు మెట్లు కట్టిస్తే భక్తులంతా మెట్ల పూజలు చేసుకుంటారన్నారు.





## హెల్దీ ఇండియా.. హ్యాపీ ఇండియా

◆ ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ వీడి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

◆ ఈ కార్యక్రమ నిర్వహణలో ఏపీ సర్కిల్ ముందంజ

◆ ఇండియా పోస్ట్ రన్ - 2024లో పెమ్మసాని

**గుంటూరు, మహానాడు:**

ముఖ్యమంత్రి చంద్రబాబుని చూస్తే గర్వంగా ఉంటుంది. ఆరోగ్యం పట్ల ఆయన తీసుకునే శ్రద్ధ యువతకు పోటీపడే ఏకైక వ్యక్తి అని అనిపిస్తుంది. దేశంలో ఎన్నో పోస్ట్ ఆఫీస్ లు, సర్కిళ్ళు ఉన్నాయి. కానీ ఏపీ సర్కిల్ మాత్రమే ఈ ఇండియా పోస్ట్ రన్-2024 కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉంది. అన్నింటిలో తాము ముందు ఉంటామని పోస్టల్ డిపార్ట్మెంట్ మరోసారి నిరూపించిందని గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఇండియా పోస్ట్ రన్ - 2024 కార్యక్రమాన్ని గుంటూరులోని స్థానిక లాడ్జ్ సెంటర్లో ఆదివారం ఉదయం పోస్టల్ శాఖ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో మహిళలు, పురుషులకు 10 కే, 5 కే, 3 కే రన్ ను కేటగిరీల వారీగా అధికారులు ఏర్పాటు చేశారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన పెమ్మసాని కార్యక్రమంలో ముందుగా ప్రజా సమక్షంలో 'స్పెషల్ పోస్టల్ కవర్' ను ఆవిష్కరించారు. అనంతరం పోస్టల్ రన్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను దక్కించుకున్న విజేతలకు బహుమతులను అందజేశారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ ఫిట్ నెస్ పై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని, ఇతరులు చూసి స్ఫూర్తి పొందాలని కోరారు. నేటి సమాజంలో పిల్లలు, పెద్దలు అందరూ టీవీలు, సెల్ ఫోన్లకు అతుక్కు పోయి రోజులో 4-5 గంటల సమయాన్ని వృథా చేసుకుంటున్నారు. ఇలాంటి పోస్టల్ రన్ కార్యక్రమాలు జరిగినప్పుడైనా అందరిలోనూ స్ఫూర్తి కలగాలి. జీవితంలో ఎంత బిజీగా ఉన్నా సరే ఆరోగ్యానికి ముఖ్యపాత్ర ఇవ్వాలని మర్చిపోకూడదని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మొహమ్మద్ నసీర్ అహ్మద్, భాష్యం ప్రవీణ్ కుమార్, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, గుంటూరు జిల్లా జనసేన అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, జనసేన పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జ్ బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ మాజీ చైర్మన్ మద్దిరాల మ్యాని తదితరులు పాల్గొన్నారు.





## ఆధ్యాత్మిక శోభతో వైభవంగా పంచ రాత్రి ఉత్సవాలు

**విశాఖపట్నం, మహానాడు:**

నగరంలోని పలు ప్రాంతాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తకోటికి కన్నుల పండుగగా కొనసాగిన తీరు లోక విదితం. జీవీఎంసీ 95 వార్డు పరిధిలోని పురుషోత్తపురం వాసులు కంఫర్ట్ హెూమ్స్ ఆధ్యాత్మిక వేదికపై దైవీ భావనలు వెదజల్లుతూ శ్రీ విజయ గణపతి ఆలయ కమిటీ నిర్వహించిన పంచమ రాత్రుల పూజ వేడుకలు ఆదివారం వైభవంగా ముగిశాయి. సకల శుభప్రదాతగా దర్శనం ఇచ్చిన కనక దుర్గమ్మను దర్శించుకోవడానికి జీవీ కాలనీ, హెచ్ బీ కాలనీ పరిసర ప్రాంత భక్తులు అసంఖ్యాకంగా తరలి వచ్చారు. వి.నారాయణ, సత్యవతి దంపతులు సహకారంతో ప్రతిష్టించిన దుర్గామాత విగ్రహానికి వేద పండితులు భాస్కర రావు శర్మ, ఆలయ అర్చకులు రామారావు శర్మ పూజాక్రతువు నిర్వహించారు. పుణ్యాహవచనం,



సహస్ర నామావళి, సామూహిక కుంకుమ పూజ, లలితా పారాయణ, మూలా నక్షత్రం నాడు పిల్లలచే సరస్వతి పూజ, లోక హితవును కాంక్షించే చండీ హెూమం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

దిగ్విజయంగా పూజలు పూర్ణాహుతితో సమాప్తం అయిన తర్వాత ఆదివారం అమ్మవారిని నిమజ్జనానికి అంబరాన్నంటే నామస్మరణతో నివాసితులు తరలించారు. కార్యక్రమ నిర్వహణలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రెడ్డి సింహాచలం మాస్టర్, కార్యదర్శి తాడిమేటి మాధవ్, కోశాధికారి ఆలమూరు కేశవరావు, ఇతర కార్యనిర్వాహక వర్గ సభ్యులు ఎ.సురేష్ డి.సునీత, భానుమతి, ఉమాదేవి, శ్రీదేవి, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కార్యదర్శులు వి.రామకృష్ణ, ఎం.సత్యనారాయణ, తదితరులు సహకరించారు.

## ఫలితాలతో బిజెపి ఫుల్ జోష్..

◆ ఇక మహారాష్ట్ర, ఝార్ఖండ్‌లపై దృష్టి

హర్యానా, జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు బీజేపీలో కొత్త జోష్‌ను నింపాయి. ఈ రెండు రాష్ట్రాల్లోనూ గతంలో కంటే మెరుగైన ఫలితాలను సాధించింది. దానితో త్వరలో జరగనున్న మహారాష్ట్ర, ఝార?ండ్ అసెంబ్లీ ఎన్నికలకు రెట్టించిన ఉత్సాహంతో సిద్ధమవుతోంది.

హర్యానాలో విజయంతో 2029 సార్వత్రిక ఎన్నికల సన్నాహాలను ఉత్సాహంగా ప్రారంభించాలన్న ఇండియా కూటమి ఆశలపై బీజేపీ నీళ్లు చల్లినట్లయింది. లోక్‌సభ ఎన్నికల్లో సొంతంగా మెజార్టీ మార్క్ చేరుకోలేక మిత్రపక్షాల సాయంతో కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన భారతీయ జనతాపార్టీకి హరియాణా, జమ్మూకశ్మీర్ అసెంబ్లీ



ఎన్నికల ఫలి తాలు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చాయి.

ఈ రెండు చోట్ల బిజెపి అంచనాలకు మించి రాణించింది. ముఖ్యంగా హిందీ హార్ట్‌ల్యాండ్‌కు తాళంగా భావించే హరియాణాలో పట్టు నిలుపుకోవడం కమలం పార్టీకి కొండంత బలాన్ని ఇచ్చింది. ఇప్పటికే హిమాచల్‌ప్రదేశ్ కాంగ్రెస్ పాలనలో ఉండగా హరియాణాను కూడా కోల్పోతే ఆ ప్రభావం మిగిలిన వాటిపై పడుతుందని ప్రతిపక్షాలు ఆశలు పెట్టుకొన్నాయి. కానీ, ఈ విజయంతో బీజేపీ ఖాతాలోకి 13వ రాష్ట్రం చేరినట్లైంది.

హరియాణా చేజారితే, కేంద్రంలో బీజేపీ సర్కారుకు ఎల్‌జేపీ, జనతాదళ్(యూ) వంటి మిత్ర పక్షాల నుంచి కూడా ఒత్తిడి ఎదురయ్యేది. ఇప్పుడు ఆ ప్రమాదం నుంచి కమలదళం బయటపడినట్లైంది. పదేళ్ల ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించి అనేక ప్రతికూల అంశాల మధ్య హరియాణాలో బీజేపీ సాధించిన విజయం ఆ పార్టీలో కొత్త జోష్‌ను నింపింది.

2014, 2019 హరియాణా అసెంబ్లీ ఎన్నికల కంటే ఎక్కువ స్థానాలను బీజేపీ కైవసం చేసుకోవడం గమనార్హం. మరోవైపు జమ్ముకశ్మీర్‌లోనూ బీజేపీ బలమైన శక్తిగానే ఆవిర్భవించింది. 2014 జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో 25 సీట్లకే పరిమితమైన కమల దళం ఈ సారి 29 స్థానాలను తన ఖాతాలో వేసుకొంది. సీట్ల పరంగా నేషనల్ కాన్ఫరెన్స్ తర్వాత అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించింది.

ఓటింగ్ శాతం పరంగా చూస్తే నేషనల్ కాన్ఫరెన్స్ కంటే బీజేపీకే ఎక్కువ ఓట్లు వచ్చాయి. గవర్నర్ నామినేట్ చేసే ఐదుగురు సభ్యుల మద్దతు బీజేపీకి దక్కే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఎన్నికల్లో పొత్తులు లేకపోయినా, భవిష్యత్తులో జమ్ము ప్రాంతంలో విస్తరించాలని భావించే పార్టీలు కచ్చితంగా బీజేపీ జట్టుకట్టే అవకాశం ఉంటుంది.

నియోజకవర్గాల పునర్విభజనలో జమ్ము ప్రాంతానికి ప్రాధాన్యం పెంచడం బీజేపీకి కలిసొచ్చిన అంశం. దీనికి తోడు ఎల్జీ పాలనలో వేర్పాటువాదు లను బలంగా అణచివేయడం వల్ల కశ్మీర్‌తో పోలిస్తే ప్రశాంతంగా ఉండే జమ్ములో బీజేపీ ఇమేజ్ బలపడింది. కశ్మీర్ కేంద్రంగా పనిచేసే ఎన్సీ, పీడీపీ వంటి పార్టీలు జమ్ముకు ప్రాధాన్యం ఇవ్వక తప్పని పరిస్థితి నెలకొంది.

భవిష్యత్తులో కశ్మీర్‌లో పగ్గాలు చేపట్టే పార్టీ ఏక పక్షంగా వేర్పాటు వాదాన్ని వెనకేసుకొచ్చే పరిస్థితి ఉండే అవకాశం లేదు. మహారాష్ట్ర, ఝార?ండ్‌లలో కూడా త్వరలోనే ఎన్నికల నగారా మోగనుంది. మహా రాష్ట్రలో కమలదళం ఇప్పటికే సర్వశక్తులు ఒడ్డి పోరాడేందుకు సిద్ధమవుతోంది. ఝార్ఖండ్‌పై కూడా ఇప్పటికే బీజేపీ గురిపెట్టింది.

ప్రధాని మోదీ స్వయంగా పలుమార్లు ఆ రాష్ట్రాన్ని సందర్శించారు. బంగ్లాదేశీయుల చొరబాట్లు, హిందువులపై దాడులు వంటి అంశాలను ఝారండ్‌లో బీజేపీ ప్రధానంగా ప్రస్తావిస్తోంది. దీనికి తోడు హేమంత్ సొరెన్ అవినీతి కేసులో అరెస్టు కావడం వంటివి కూడా ఇండియా కూటమికి ప్రతికూలంగా మారవచ్చు. మొత్తం మీద ఈ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్‌తో కలిసి కాంగ్రెస్‌కు జమ్ముకశ్మీర్‌లో అధికారం దక్కినా కీలకమైన హరియాణాలో రాణించకపోవడం హస్తం పార్టీకి పెద్ద ఎదురుదెబ్బనే చెప్పాలి.

(నిజం టుడే సౌజన్యంతో)

## "సృజనా"త్మకమైన ఆలోచనలు



◆ రాజశేఖర్ అదేశాలతో విజయవంతమైన దసరా ఉత్సవాలు

◆ అధికారుల సమన్వయం - ఫ్రెండ్లీ పోలీసింగ్

◆ కె.ఎస్. రామరావు నిరంతర పర్యవేక్షణ

**విజయవాడ,మహానాడు:**

ఇంద్రకీలాద్రిపై కొలువైఉన్న కనకదుర్గమ్మకు ప్రతి ఏటా నిర్వహిస్తున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఈ ఏడాది విజయవంతగా ముగిశాయి. శాస్త్రోక్తంగా నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమం వైభవం జరిగింది . ఉత్సవాలలో అమ్మవారి దర్శనం గొప్ప ఆధ్యాత్మిక అనుభూతిని కల్పించింది.

గతంలో లోపించిన సమన్వయం...ఈ ఉత్సవాలలో కనిపించలేదు. శాఖల మధ్య సమన్వయమే ఈ ఉత్సవాల విజయవంతానికి ప్రధాన కారణమని చెప్పక తప్పదు .భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేయడంలో జిల్లా యంత్రాంగం కృతకృత్యులయ్యారు. గత దశాబ్ద కాలంగా ప్రతి ఏడాది ఏదో ఒక ఇబ్బందికరమైన పరిస్థితులు తలెత్తి, భక్తులకు కలిగిన అసౌకర్యాలను అధిగమించేందుకు ఈ ఏడాది దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సహకారంతో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన వినూత్న ఆలోచనలతో పోలీస్ కమిషనర్ ఆదేశాలను అధికారులు సమన్వయంతో అమలు చేసి ఉత్సవాలలో సేవలందించారు. వివిధ శాఖలకు చెందిన సిబ్బంది పూర్తి స్థాయిలో చిత్తశుద్ధితో విధులు నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ నిరంతరం ఆయా శాఖల అధిపతులతో ప్రతి అంశంలోనూ ప్రత్యక్ష పర్యవేక్షణ చేయడం ఈ ఉత్సవాలలో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అంశం.

ముఖ్యంగా భక్తుల సంఖ్యను ఎప్పటికప్పుడు అంచనా వేసి జగన్మాతను దర్శించుకునేందుకు ఎంత సమయం పడుతుంది, క్యూలైన్‌లో ఎంతసేపు ఉంటారో... అనే ఖచ్చితమైన అంచనాతో అందుకు తగినట్లు వారికి గతంలో కంటే మిన్నగా వాటర్ బాటిల్స్, వేడి పాలు, మజ్జిగ వంటి ద్రవపదార్థాల పంపిణీ కోసం అవసరమైన చర్యలు తీసుకోవడంలో సఫలీకృతమయ్యారు.

స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అందించిన సేవా కార్యక్రమాలు సైతం ఒక క్రమ పద్ధతిలో అందించేందుకు సమయానుకూలంగా ఆయా స్వచ్ఛంద సేవకులకు సరైన సమయంలో అవసరమైన ఆదేశాలు అందించడంతో జగన్మాతను దర్శించుకునేందుకు వచ్చిన ప్రతి భక్తుడు సంతృప్తికరమైన దర్శన భాగ్యం పొందేలా తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయి.

ఇదే క్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఒక నిర్దేశిత సమయం కేటాయించి, వారి వారి దర్శన వేళల్లో ఇబ్బందులు తలెత్తకుండా ప్రోటోకాల్ విభాగం జాగరూకతతో వ్యవహరించి సామాన్య భక్తులకు సత్వర దర్శనం లభించేలా ఒక ప్రత్యేకమైన కార్యాచరణను అమలు చేయడం కూడా ఈ ఉత్సవాలలో ఒక వినూత్నమైన చర్య.



గతంలో వాహనాలతో నిండిపోయిన ఘాట్ రోడ్డు మొత్తం ఈసారి మాత్రం అనుమతి ఉన్న వాహనాల రాకపోకలకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా పోలీస్ శాఖ చేపట్టిన చర్యల వల్ల ప్రముఖుల దర్శనాలకు ఎటువంటి అంతరాయం కలగకుండా సత్వరమే దర్శనం చేసుకున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల కారణంగా నగరంలోని పౌరులకు సాధారణంగా కలిగే ఇబ్బందులను తగ్గించేందుకు నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు చేపట్టిన చర్యలు కూడా ఉత్సవాల విజయవంతానికి ఒక ప్రధాన కారణంగా చెప్పుకోవాలి.

ముఖ్యంగా ప్రతి ఏటా పోలీసు శాఖలోని కొందరు అధికారులు యూనిఫాం దుస్తులతో దర్శనాల పేరిట చూపిన అత్యుత్సాహం ఈసారి కనిపించదని ఉత్సవాల నిర్వ హణకు ముందే ఏర్పాటుచేసిన వివిధ శాఖల సమన్వయ సమావేశంలో ఇచ్చిన మాట ప్రకారం కట్టడి చేశారు.

ఉత్సవాల ముగింపు రోజైన శనివారం భవానీ మాల ధారుల రాక పెరగడంతో పోలీస్ శాఖ అప్రమత్తమైంది. జై భవాని నామస్మరణలతో ఇంద్రకీలాద్రి పర్వతం ఎరుపె



క్కింది. వేలాదిగా తరలివచ్చిన భవానీలను నియంత్రించేందుకు పోలీసు శాఖ ఎంతో కష్టపడి సేవలు అందించడంతో... అతి తక్కువ సమయంలో దర్శన సౌకర్యం అందరికీ అందుబాటులో ఉండేలా నియంత్రించారు.

సాధారణ భక్తుల ఇబ్బందులను అధిగమించేందుకు, లోటుపాట్లను చక్కదిద్దేందుకు జిల్లా కలెక్టర్ పోలీస్ కమిషనర్‌లు కంట్రోల్ రూం నుండి నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ఆదేశాలు ఇవ్వడంతో దుర్గమ్మను దర్శించుకున్న ప్రతి భక్తుడు ఒక అనిర్వచనీయమైన ఆధ్యాత్మిక అనుభూతితో తన్మయత్వం చెందారని చెప్పడంలో అతిశయోక్తి లేదు. నగరంలోని అనేక ప్రాంతాలలో ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న ఉత్సవాలను వీక్షించేందుకు ప్రత్యేకంగా తెరలు ఏర్పాటు చేయడం ఈ ఉత్సవాలలో హైలెట్.

ఈ ఉత్సవాల నిర్వహణలో సేవలందించేందుకు రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చిన ఉద్యోగులకు ఆహారం, వసతి వంటి అంశాలలో సైతం ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చేసిన ఏర్పాట్లు కూడా ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఇంతటి భారీ కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేసేందుకు సేవలందించిన ప్రతి విభాగం చిత్తశుద్ధితో బాధ్యతలు నిర్వహించడం ఈ శరన్నవరాత్రి ఉత్సవాల విజయవంతానికి ప్రధాన భూమిక పోషించింది.

జిల్లా కలెక్టర్‌గా బాధ్యతను స్వీకరించిన కొద్ది రోజుల్లోనే డాక్టర్ జి.సృజన తన పనితీరును జిల్లా ప్రజలకు తెలియజేసేందుకు ఇది ఒక మంచి అవకాశంగా భావించవచ్చు. దుర్గమ్మను దర్శించుకున్న ప్రతి భక్తుడు ఒక అలౌకిక ఆనందంతో, సంతృప్తికరంగా దర్శనం చేసుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడంలో జిల్లా యంత్రాంగం సంపూర్ణంగా విజయవంతమైంది.

## అలరించిన జబర్దస్త్ కళాకారుల కామెడీ షో

**పుట్టపర్తి, మహానాడు:**

దసరా ఉత్సవాల సందర్భంగా ఇక్కడి శిల్పారామంలో నిర్వహించిన జబర్దస్త్ కామెడీ షో ప్రేక్షకులను అలరించింది.

బృందం అందించిన కామెడీ ప్రేక్షకుల్లో నవ్వులు పూయించింది. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, రఘునాథ్ రెడ్డి సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జబర్దస్త్ కామెడీ సభ్యులు బుల్లెట్ భాస్కర్, నరేష్ సహా పలువురు గాయనీగాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

6

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || సోమవారం 14, అక్టోబర్ 2024 ||

## నేను ఇచ్చిన మరో హామీ నెరవేరింది

- మంత్రి నారా లోకేష్



**అమరావతి, మహానాడు:** యువగళం పాదయాత్రలో నేను ఇచ్చిన మరో హామీని చంద్రబాబు నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం నెరవేర్చింది. వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని బోయ, వాల్మీకి సోదరులు పాదయాత్రలో నన్ను కలిసి విన్నవించారని

రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ గుర్తు చేశారు. వారి సెంటిమెంటును గౌరవిస్తూ వాల్మీకి జయంతిని ఈనెల 17వ తేదీన అన్ని జిల్లా కేంద్రాల్లో అధికారికంగా నిర్వహించాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. అదేరోజు అనంతపురంలో రాష్ట్రస్థాయి వాల్మీకి జయంతిని నిర్వహిస్తున్నాం... తెలుగుదేశం పార్టీ బీసీల పుట్టినిల్లు... వారి ఆత్మ గౌరవాన్ని పెంచే దిశగా మా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఈ సందర్భంగా ఒక ప్రకటనలో మంత్రి పేర్కొన్నారు.

# పవన్ ప్రస్థానం .. సినీ హీరో టు పొలిటికల్ విలన్

(డీవీవీఎస్ వర్మ)

పవన్ కల్యాణ్ సినిమాలలో అనేక హీరో పాత్రలు పోషించారు. రాజకీయాలలోనూ ఆయన బహుపాత్రధారి కావడం ఆశ్చర్యాన్ని కలిగించదు. రాజకీయ ఆరంగేట్రం చేసినప్పుడు 'చే గువేరా' బొమ్మతో అలరించారు.

తర్వాత భగత్‌సింగ్ తన ఆదర్శంగా ప్రకటించారు. ఇప్పుడు తాజాగా "సనాతన ధర్మం హీరో " పాత్రధారణ చేస్తున్నారు.

తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యి తో అపవిత్రమైన ప్రసాదం అంశం పై పవన్ పాప పరిహార దీక్షతో ఇది ప్రారంభమౌతుంది. పూజలు, ప్రాయశ్చిత్తాలు, దుర్గ గుడి మెట్ల కడుగుడు ఘట్టాలు పూర్తి అయ్యాయి.

నడక మార్గంలో తిరుమల మెట్ల అధిరోహణం చేసి

ద్వైవ దర్శనం అనంతరం తిరుపతి వారాహి సభలో సనాతన ధర్మం పై తన ట్రయిలర్‌ను రిలీజ్ చేశారు.

ఇక ఇంటర్ వెల్ తర్వాత కథ ఎన్ని మలుపులు తిరిగి క్లైమాక్స్‌కు చేరుకుంటుందో మనం ఊహించుకోవలసిందే.

పవన్‌కు ఇదొక్కటే పని కాదు.

యథావిధిగా ఆయన చేయాల్సిన ఇతర సినిమాల షూటింగులు వున్నాయి.

ఉప ముఖ్యమంత్రి గానే కాకుండా నిర్వహిచాల్సిన పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి వంటి కీలక శాఖలను నిర్వహించే బాధ్యతలు ఉన్నాయి. వారాహి సభ ప్రసంగాన్ని చూస్తే ఈ బాధ్యతలకు ఇచ్చే కాల్‌షీట్స్ కంటే సనాతన ధర్మానికి ఎక్కువ ఇచ్చేలా కనిపిస్తుంది.

సనాతన ధర్మాన్ని కించపరిస్తే సహించేది లేదని ఈ సభలో ప్రకటిస్తూ అలాంటి వారికి సహాయ నిరాకరణ చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో సనాతన పరిరక్షణకు చట్టం తేవాలని సనాతన ధర్మాన్ని కించపరిచే వారిపై చర్యలు తీసుకునే విధంగా దానిని రూపొందించాలని వారాహి డిక్లరేషన్‌లో కోరారు.

తన సనాతన ధర్మం అన్ని మతాలను గౌరవిస్తుందనే పైపై డైలాగులు తప్పిస్తే నిర్దిష్టంగా సనాతన ధర్మం ఏమిటన్న స్పష్టత ఇవ్వలేదు. ఆయన సనాతన ధర్మాన్ని వేద ప్రమాణంగా భావించివుంటే రుగ్వేదంలోని పురుష సూక్తం వుంది. మనుషుల పుట్టుకలోనే వున్న వివక్షను అది నొక్కి చెప్పింది. "ఆ పురుషుని నోటినుండి బ్రాహ్మణులు,చేతుల నుండి క్షత్రియులు, తొడలనుండి వైశ్యులు, పాదాలనుండి శూద్రులు జన్మించారని పేర్కొంది.పవన్ సనాతన ధర్మం వేద ప్రమాణమే అయితే పుట్టుకతో వివక్షను సమర్థించడమే అవుతుంది.

సనాతన ధర్మానికి ప్రాణప్రదమైన 'మనుస్మృతి' కుల వ్యవస్థను, కులాల చట్రంలో వృత్తులను నిర్దేశించింది. స్త్రీలకు స్వాతంత్ర్యాన్ని నిరాకరించింది. శూద్రులందరికీ చదువును నిరాకరించింది.ఇలాంటి సనాతన ధర్మాన్నే పవన్ కోరుకుంటున్నారా ?

అలాగే భగవద్గీత కూడా మరో సనాతన ధర్మాన్ని ప్రబోధించే గ్రంథమే. అందులో నాలుగు వర్ణాలను నేనే సృష్టించానని శ్రీ కృష్ణ పరమాత్మ ప్రకటించడాన్ని సనాతన ధర్మంగానే పవన్ భావిస్తున్నారా ?

వీటిని నిరాకరిస్తున్నట్లు పవన్ కల్యాణ్ ప్రకటిస్తే అది "సనాతన ధర్మం" కాకుండా పోతుంది.సనాతన ధర్మాన్ని 21 సంవత్సరాల వయస్సు నుండి పాటిస్తున్నానని పవన్ చేసిన ప్రకటన సినిమాలో హీరోలు చేసే నకిలీ స్టంటు గానే మిగిలి పోతుంది.

పవన్ కల్యాణ్ తన దీక్ష సందర్భంగా కాషాయ వస్త్రం ధరించారు. ఇది సనాతన ధర్మానికి చెందిన రంగు కాదు. బౌద్ధుల నుంచి హిందూ మతాచార్యులు కాషాయాన్ని తస్కరించారు. వాస్తవానికి బౌద్ధం సనాతన ధర్మం మీద తిరుగుబాటు చేసింది. తిరుగుబాటు దారుల కాషాయ రంగును కప్పుకుని సనాతనధర్మ పునరుద్ధరణకు పూనుకోవడం విడ్డూరం కాక మరేమిటి?

వివాహ బంధంలో విడాకులు అన్నది ఆధునిక కాలానికి చెందిన భావన. కాని, సనాతన ధర్మంలో విడాకులు అన్న పదమే లేదని బ్రహ్మశ్రీ చాగంటి



కోటేశ్వరరావు ప్రవచించారు. సంస్కృతంలో విడాకులు అన్న పదమే లేదని పండితులు చెబుతున్నారు. కులాంతర, మతాంతర, దేశాంతర వివాహాలను సనాతన ధర్మం నిషేధించింది. సనాతన ధర్మం పేరుతో పవన్ వీటిని సమర్థిస్తారా?

మన భారతీయ సమాజం అనేక దశలను దాటి ప్రజాస్వామ్యానికి చేరుకున్నది. తనదైన రాజ్యాంగాన్ని ఆమోదించుకుని రిపబ్లిక్ గా అవతరించింది.

ఇప్పుడు కుల వివక్షకీ, లింగ వివక్షకీ తావులేదు. చదువుకునే హక్కు అందరికీ వచ్చింది. కుల చట్రంలో వృత్తుల బిగింపు సడలిపోయింది. సనాతన ధర్మం ఆధారంగా జైళ్ళలో ఖైదీలకు కులాల ప్రాతిపదికగా

పనులు కేటాయించడం రాజ్యాంగ విరుద్ధమని ఇటీవలే సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది.

ఇవన్నీ సనాతన ధర్మాన్ని సంస్కరించడం ద్వారా సాధ్యమయ్యాయి. దీని కోసం సనాతన ధర్మంలోని అధర్మం మీద వివక్ష మీద ఉద్యమాలు, సంస్కరణలు విమర్శలు జరిగిన చరిత్ర మనకు వుంది.

తిరుపతి వారాహి సభలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని వ్యతిరేకించే వారితో గొడవ పెట్టుకోవడానికే ఇక్కడకు వచ్చానని ప్రకటించారు.

ఆయన ఎలాంటి వారితో గొడవ పెట్టుకోవాలనుకుంటే అలాంటి వారితో గొడవ పెట్టుకో వచ్చును. అది ఆయన ఇష్టం.

అంటే మను ధర్మ శాస్త్రాన్ని బహిరంగంగా తగులపెట్టిన అంబేడ్కర్‌తో పవన్ గొడవ పెట్టు కోవాలి.. అన్నీ వేదాల్లోనే ఉన్నాయష అని సనాతన ధర్మాన్ని ఎద్దేవా చేసిన గురజాడతో, సనాతనంపై తిరుగుబాటు చేసిన వీరేశలింగంతో, త్రిపురనేని రామస్వామి వగైరాలతో ఆయన గొడవకు దిగాలి..

పవన్ ఇలాంటి వారి మీద యుద్ధం మొదలు పెడితే "సనాతన ధర్మం హీరో " బిరుదు వస్తే రావచ్చు.

రాష్ట్రంలో రాజకీయంగా ఎదగడానికి చిరకాల వాంఛగా ముఖ్యమంత్రి పదవిని అధిరోహించడానికి మంచిమార్గాలు వున్నాయి. తనకు దక్కిన అవకాశం పరిధిలో పరిపాలనా దక్షతను ప్రదర్శించడం ద్వారా

లేదా ప్రజలకు స్వతంత్ర జీవితాన్ని అందించే ప్రత్యామ్నాయ విధానాలకు పోరాడే పార్టీగా ప్రజల విశ్వాసాన్ని పొందే మార్గాలను అనుసరించ వచ్చును.

కాని పవన్ కల్యాణ్ ఒక వక్ర మార్గాన్ని ఎంచుకున్నారు.

రాష్ట్రంలో రాజకీయ "హీరోగా" ఎదగడానికి సనాతనం ముసుగులో విద్వేష రాజకీయ విలన్ "పాత్ర పోషించే అడ్డదారిని ఎంచుకున్నారు.

ఒక పక్క ఢిల్లీ పెద్దలతో మమేకం కావడం, మరో పక్క రాష్ట్రంలో పెద్దన్న పాత్రను పోషిస్తున్న తెలుగుదేశం పార్టీని వెనక్కి నెట్టడానికి ,ఒక్క దెబ్బతో రెండు పిట్టలను వశపరుచుకునే దుస్సాహసానికి పూనుకున్నారు.

దీనికోసం పవన్ తనకు సాధనంగా దొరికిన సనాతన ధర్మాన్ని వెతుకుతూ ఎంత వెనుకకు పోవాలనుకుంటే అంత వెనుకకు పోవచ్చును.

ఆయనతో పాటే ప్రజలు కూడా వెనకకి నడుస్తారని, వారు తన "సనాతన ధర్మ చిత్రం "బాక్సాఫీసులు బద్దలు కొడతారని అనుకోవడం మాత్రం కేవలం భ్రమే అవుతుంది.

ఎందుకంటే "ఆదిత్య 360 సినిమా"లో లాగ సమాజం మాత్రం వెనక్కు నడవదు. దాని పరమ లక్ష్యం మరింత స్వేచ్ఛ కోసం, మరింత ప్రజాస్వామ్యం కోసం, వివక్ష లేని సమాజం కోసం ముందుకు సాగడమే. సమాజాన్ని వెనకకు నడిపించాలని తలపెట్టే వారిని నిర్దాక్షిణ్యంగా పక్కకు నెట్టేసి మరీ ముందుకు సాగుతుంది.

# 'బ్యాడ్ బాయ్'.. 'మంచి పుస్తకం' రాయలేరు...

– బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి లంకా దినకర్

**విజయవాడ, మహానాడు:** వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో రూల్ బుక్స్ ప్రకారం పరిపాలించక పోవడం, అణచివేత, నిరంకుశ ధోరణితో అన్ని ప్రాంతాల ప్రజలపైన ఇష్టారాజ్యంగా ప్రవర్తించడంతో 'రెడ్‌బుక్' తయారైంది. ఇవే కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2019–24 మధ్య కాలంలో వైసీపీ పాలనలో ఆర్థిక, పరిపాలనాపరమైన అవకతవకలు నిత్యకృత్యం అయ్యాయని భారతీయ జనతా పార్టీ(బీజేపీ) రాష్ట్ర అధికార ప్రతినిధి లంకా దినకర్ విమర్శించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

వైఎస్ జగన్ 'గుడ్ బుక్' రాయడం అంటే తన పరిపాలనలోని అకృత్యాల, అరాచకాల అనుభవాలను రాసుకుని, రాష్ట్రాన్ని అన్ని రంగాలలో ప్రతికూలంగా ప్రభావితం చేసిన తన ప్రభుత్వంలో తన వైఖరి సంబంధించిన ఉదాహరణలను పొందుపరిచి భవిష్యత్తులో పాలకులు ఎలా పరిపాలించకూడదో చెప్పగలిగితే, తప్పకుండా అది 'మంచి పుస్తకం' అవుతుంది.

రాజకీయ నాయకులు ప్రభుత్వంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం సమయం కేటాయిస్తూ పనులు చేస్తుంటారు. కానీ దురదృష్టవశాత్తూ, జగన్మోహన్ రెడ్డి దశాబ్దానికి పైగా అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా అవినీతి కేసులు కోర్టుల్లో వాయిదాలు వేయించుకోవడానికి సమయం వృథా చేశారు కానీ సమాజానికి ఉపయోగపడింది ఏమీ లేదు. ఇంకా, 2019–24 మధ్య తన ప్రభుత్వ హయాంలో అతను ఎల్లప్పుడూ ప్రజలను ప్రాంతం, మతం ప్రకారం విభజించి రెచ్చగొట్టే పాలన చేశాడు. నేడు ప్రతిపక్షంలో కూడా అదే పద్ధతిని అయిన కొనసాగిస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ సంకల్పం వికాసిత్ భారత్‌లో ఏపీని భాగస్వామ్యం చేయడం. అలాగే, ప్రతి జిల్లా, ప్రతి మండలం అభివృద్ధికి 'స్వర్ణ ఆంధ్ర' కోసం 'విజన్ డాక్యుమెంట్' తయారీకి ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారు.

వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వ హయాంలో పూర్తిగా విఫలమైన జల్ జీవన్ మిషన్ కార్యక్రమాన్ని సరిచేసి అన్ని గ్రామాల్లోని ప్రతి ఇంటింటికీ 100% మంచినీటిని అందించడం కోసం ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కార్యాచరణకు ఉపక్రమించారు.

రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ యువతలో నైపుణ్యాన్ని పెంపొందించి, సరైన చోట సరైన అవకాశాల కోసం, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ వృద్ధికి 10 వేల మంది ఉపాధి కల్పించబోతున్న టీసీఎస్ వంటి సంస్థల పెట్టుబడులను ఆకర్షించేలా ప్రోత్సహించేందుకు "స్కిల్ సెన్సస్" కోసం కృషి చేస్తున్నారు. ఇప్పటికే స్కిల్ సెన్సెస్ పైలెట్ ప్రాజెక్ట్ కోసం అడుగులు పడడం విశేషం.



వైఎస్ జగన్మోహన్ రెడ్డి తన, అతని కుటుంబ సభ్యుల ఆర్థిక అభివృద్ధి, సంక్షేమం కోసం అవకాశం వచ్చిన ప్రతిసారీ అక్రమంగా ప్రభుత్వాన్ని వాడుకున్నారు. ప్రతి క్షణం అతని ఆలోచన విధానంలో అవినీతి పద్ధతులు, అరాచకాలు నిండి ఉంటాయి. కాబట్టి 'బ్యాడ్ బాయ్ మంచి పుస్తకం' రాయలేరు.

## భారత్‌ను ముప్పుగా చూపేందుకు

# బంగ్లాదేశ్‌లో కుట్ర

- ఆర్ఎస్ఎస్ సర్ సంఘచాలక్ డా. మోహన్ భగవత్

**నాగపూర్,మహానాడు:** భారత్‌ను ఒక ముప్పుగా చూపించేందుకు బంగ్లాదేశ్లో కుట్రలుజరుగుతున్నాయని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సర్ సంఘచాలక్ డా. మోహన్ భగవత్ హెచ్చరించారు.

భారత్ నుండి తమకు ముప్పు ఏర్పడుతుందనే సాకు చూపుతూ అణ్వాయుధాలు కలిగిన పాకిస్థాన్ తో స్నేహం చేయడం ద్వారా భారత్ ను కట్టడి చేయవచ్చని ప్రస్తుతం అక్కడ అధికారంలో ఉన్న వ్యక్తుల నుండి వస్తున్న వాదనలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు.

నాగపూర్ లోని ఆర్ఎస్ఎస్ కేంద్ర కార్యాలయంలో విజయదశమి ఉత్సవంలో పూజ చేసిన మోహన్ భగవత్ బంగ్లాదేశ్లో పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు.

అటువంటి కథనాలు వ్యాప్తి చేయడం వెనుక ఉన్న అంతర్జాతీయ శక్తుల గురించి మనకు తెలుసని స్పష్టం చేశారు. వారి పేర్లను ప్రస్తావించనవసరం లేదంటూ వారి ఉద్దేశయం అంతా అటువంటి అరాచక పరిస్థితులను భారత్ లో సృష్టించటమే అని ఆయన హెచ్చరించారు.

అటువంటి శక్తుల ఆగడాలను సాగనీయరాదని తేల్చి చెప్పారు. "మన సంస్కృతి, సంప్రదాయాలకు వ్యతిరేకంగా అక్కడ ప్రచారం చేస్తున్నారు. హిందువులను శత్రువులుగా చూసే పరిస్థితి తీసుకువస్తున్నారు. మన సంకల్పాన్ని బల హీన పరిచేందుకు, భారత్ను అస్థిర పరిచేందుకు కుట్రలు చేస్తున్నారు" అని మోహన్ భగవత్ ధ్వజమెత్తారు.

బంగ్లాదేశ్లో నిరంకుశ ఛాందసవాదం రాజ్యమేలుతోందని ఆరోపించారు. అక్కడి హిందువులతో సహా మైనారిటీల తలలపై కత్తి వేలాడుతోందని మోహన్ భగవత్ ఆందోళన వ్యక్తం చేశారు. షేక్ హసీనా సారథ్యంలోని ప్రభుత్వం కుప్పకూలిన తర్వాత అక్కడ నెలకొన్న పరిణామాలు ప్రతి హిందువునూ ఆందోళనకు గురిచేస్తున్నాయని తెలిపారు.

ఒక్క హిందువులు మాత్రమే కాకుండా, బంగ్లాదేశ్‌లో నివసిస్తున్న ప్రతి మైనారిటీ కూడా దాడుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడి రాజకీయ పరిణామాలను హిందువులపై దాడులకు ఉపయోగించుకుంటున్నారంటూ ఆయన మండిపడ్డారు.అక్కడ హిందువులపై అఘాయిత్యాలకు పాల్పడే సంప్రదాయం పునరావృతమైందంటూ ఆవేదన వ్యక్తంచేశారు.

ఈ పరిస్థితుల్లో హిందువులు ఏకతాటిపైకి రావడం,



సమైక్యంగా రోడ్ల మీదికి వచ్చి ఉద్యమించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోందని చెప్పారు. ర్యాడికల్ భావ జాలంతో హిందువులందరూ సంఘటితమయ్యారని, తమ రక్షణ కోసం రోడ్లపైకి వచ్చారని చెప్పారు. హిందువులకే కాదు, మైనారిటీలందరికీ భారత్ సహాయం చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

అయితే బంగ్లాదేశ్ నిర్మాణంలో భారతదేశం కీలకంగా వ్యవహరించిన సంగతి అందరికీ తెలిసిందేనని చెప్పారు. మరి అలాంటి బంగ్లాదేశ్‌కు వ్యతిరేకంగా, భారత్ ఎలా పని చేస్తుందని ఈ సందర్భంగా ఆయన ప్రశ్నించారు. బంగ్లాదేశ్ విషయంలో భారత్ ఎప్పటికీ అలా వ్యవహారించదని ప్రకటించారు. అయితే ఈ తరహా కథనాలు చేస్తున్న వారి పట్ల చాలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

హిందువులు ప్రపంచంలో ఎక్కడ ఉన్నా కూడా ఐక్యంగా శక్తిమంతం కావాల్సిన అవసరం ఉందని, బంగ్లాదేశ్‌లో చోటుచేసుకుంటున్న అఘాయిత్యాలు, దురాగతాలకు వ్యతిరేకంగా తమ గళాన్ని వినిపించాలని మోహన్ భగవత్ కోరారు.

బలహీనంగా ఉండడమనేది నేరమనే విషయాన్ని ప్రతి ఒక్కరు అర్థం చేసుకోవాలని ఆయన హిందువులకు సూచించారు. మనం బలహీనంగా ఉంటే మాత్రం దుర్మార్గుల దురాగతాలను ఆహ్వానించడమేనని పేర్కొంటూ ఈ విషయాన్ని హిందువులు గుర్తించాలని చెప్పారు.

సమాజంలో అరాచకం, భయాందోళనల వాతావరణాన్ని సృష్టించేందుకు ప్రయత్నిస్తున్న సమూహాలపై అప్రమత్తంగా ఉండాలని డా. భగవత్ హెచ్చరించారు. ఈ రోజుల్లో 'డీప్ స్టేట్', 'వోకీయిజం', 'కల్చరల్ మార్క్సిస్ట్' వంటి పదాలు చర్చలో ఉన్నాయని చెబుతూ.. వారు అన్ని సంస్కృతీ సంప్రదాయాలకు ప్రకటిత శత్రువులని స్పష్టం చేసారు. విలువలు, సంప్రదాయాలు, ఏది ధర్మం–శుభప్రదమైనదిగా పరిగణించబడుతుందో దానిని నాశనం చేయడం ఈ సమూహం కార్యనిర్వహణలో ఒక భాగం అని విమర్శించారు.

ఈ పద్ధతి మొదటి దశ సమాజంలోని మనస్సును రూపొందించే వ్యవస్థలు, సంస్థలను ఒకరి ప్రభావంలోకి తీసుకురావడం అంటూ ఉదాహరణకు, విద్యావ్యవస్థ, విద్యాసంస్థలు, మీడియా, మేధో సంభాషణ మొదలైనవని చెప్పారు. ఆ తర్వాత ఆలోచనలను, విలువలను నాశనం చేయడం, వారి ద్వారా సమాజపు నమ్మకాలను వమ్ము చేయడంగా వివరించారు.

మహిళలపై అకృత్యాలపై మోహన్ భగవత్ ఆందోళన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్కతా జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటన, మన సమాజానికి సిగ్గుచేటని చెప్పారు. మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని పేర్కొన్నారు. నేరం జరిగి ఇంతకాలమైనా, బాధితురాలికి న్యాయం జరగకపోవడం సమాజాన్ని తీవ్రంగా నిరుత్సాహపరుస్తోందని అని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు.

సమాజంలో విభేదాలు అనేవి ఉండకూడదని చెబుతూ ప్రపంచదేశాల్లో భారత్ ఖ్యాతి పొందిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. భారతదేశం వైవిధ్యమైన దేశమని తెలిపారు. ఈ దేశానికి అదే బలమని ఆయన అభివర్ణించారు. కొంత మందికి భారతదేశ పురోగతిపై సమస్యలు ఉన్నాయంటూ ఆయన పరోక్ష విమర్శలు చేశారు.

కులం, భాష, ప్రాంతం మొదలైన వాటి ఆధారంగా సమాజంలో చీలికలను సృష్టించే అంశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆర్ఎస్ఎస్ అధినేత హితవు చెప్పారు. ప్రజలను కోరారు. సమాజం చిన్నచిన్న సమస్యలపై దృష్టి సారిస్తూనే ఉంటూ, ఆలస్యం అయ్యే వరకు వారి తలలపైకి దూసుకుపోతున్న సంక్షోభాన్ని అర్థం చేసుకోదని హెచ్చరించారు.

"దేశంలో ఎటువంటి కారణం లేకుండా మతోన్మాదాన్ని రెచ్చగొట్టే సంఘటనలు ఒక్కసారిగా పెరిగిపోతున్నాయి. పరిస్థితి లేదా విధానాల గురించి మనస్సులో అసంతృప్తి ఉండవచ్చు. కానీ దానిని వ్యక్తీకరించడానికి, వాటిని వ్యతిరేకించడానికి ప్రజాస్వామ్య మార్గాలు ఉన్నాయి. ఈ మార్గాలను అనుసరించకుండా, హింసను ఆశ్రయించడం, సమాజంలోని ఒక నిర్దిష్ట వర్గంపై దాడి చేయడం, కారణం లేకుండా హింసను ఆశ్రయించడం, భయాన్ని సృష్టించడానికి ప్రయత్నించడం, గూండాయిజం, దీనిని ప్రేరేపించడానికి లేదా ప్రణాళికాబద్ధంగా చేయడానికి చేసే ప్రయత్నాలను 'అరాచకత్వానికి వ్యాకరణం' అంటా" అని ఆయన తెలిపారు.

ఇటీవలి గణేశోత్సవంలో జరిగిన దౌర్జన్యాలను ప్రస్తావిస్తూ దోషులను తక్షణమే నియంత్రించి శిక్షించవలసి ఉంటుందని చెప్పారు. కానీ వారు వచ్చే వరకు, సమాజం తన ప్రియమైనవారి ప్రాణాలతో పాటు తన ఆస్తిని రక్షించుకోవాలని సూచించారు. అందువల్ల, సమాజం ఎల్లప్పుడూ పూర్తిగా అప్రమత్తంగా, సంసిద్ధంగా ఉండాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ దుష్ట ధోరణులను, వాటికి మద్దతు ఇచ్చేవారిని గుర్తించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

7

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ సోమవారం 14, అక్టోబర్ 2024 ‖

## సీఐ కుర్చీలో మంత్రి కొండా

### సోషల్‌మీడియాలో హల్‌చల్

### ముదురుతున్న కొండా-రేవూరి ఫ్లెక్సీ వార్



**ధర్మారం,మహానాడు:** కొండా వర్సెస్ రేవూరి వర్గీయుల మధ్య ఫ్లెక్సీల వివాదం గీసుగొండ పోలీస్ స్టేషన్ వద్ద తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. దీనితో కొండా వర్గీయులను గీసుగొండ పోలీసులు అరెస్ట్ చేయడంతో, కొండా వర్గీయులు ధర్మారం వద్ద ధర్నా చేశారు. ఇది తెలుసుకున్న మంత్రి కొండా సురేఖ అక్కడికి చేరుకొని గీసుగొండ పోలీస్ స్టేషన్ కు చేరుకొని సీఐ కుర్చీలో కూర్చుని, పోలీసులతో మాట్లాడే వీడియో వివాదాస్పదంగా మారింది.

పోలీస్ స్టేషన్ లో ఉన్న కొండా సురేఖకు హై కమాండ్ నుండి ఫోన్ రావడంతో వెంటనే పోలీస్ స్టేషన్ నుండి మీడియాతో నేను ఏమీ మాట్లాడను అంటూ వెళ్ళి పోయారు. గతంలో కొండా వర్సెస్ రేవూరి మధ్య జరిగిన ఫోన్ సంభాషణ సంచలనంగా మారిన పరిస్థితి. ఇప్పుడు ఫ్లెక్సీల వివాదం మళ్లీ వారిద్దరి మధ్య మరింత దూరాన్ని పెంచింది. ఈ వివాదాలు ఎక్కడకు దారి తీస్తాయో వేచి చూడాలి.

# ఆ 'బాబు' బంగారమేనట!

" ఆయనో మ్యాజిక్ మాస్టర్. ఐఏఎస్‌లలో ఆయన స్టైలే వేరు. కథలు చెప్పడంలో చేయితిరిగిన రచయితలు కూడా ఆయన ముందు దిగదుడుపే. దేవతావస్త్రాల కథ చెప్పడంలో 'ఉత్తుత్తి యూనివర్శిటీ'లో ఆయన పీహెచ్‌డీ చేశారు. ఉన్నది లేనట్లు.. లేనిది ఉన్నట్లు చూపడంలో అఘటనాఘట సమర్థుడు. గజకర్ణ గోకర్ణ టక్కు టమార విద్యల్లో ఆరితేరిన అధికారి.

ఆర్ట్ ఆఫ్ లివింగ్‌లో రవిశంకర్‌కే పాఠాలు చెప్పగలిగేంత గొప్పోడు. "

- జగన్ ఏలుబడిలో ఓ ఐఏఎస్ చేతి మీదుగా అమూల్ పాలైన 2 వేల కోట్ల ఋణం
- క్విడ్ ప్రోకో పథకంలో 'కోడ్ ట్రీ' ద్వారా ఆ ఐఏఎస్‌కు భారీ నజరానా
- ఏమిటీ కోడ్ ట్రీ ?
- ఐఏఎస్‌కు కోడ్ ట్రీకి లింకేంటి?
- సోషల్ మీడియాలో విరుచుకుపడుతున్న తెలుగుతమ్ముళ్లు

(మార్తి సుబ్రహ్మణ్యం)

అలాంటి మ్యాజిక్ చేసే.. గతంలో బాబు సర్కారును భ్రమల్లో పెట్టి ముంచేశారు. టెక్నాలజీ అంటే మురిసిపోయే చంద్రబాబు కూడా, సారు మాటలకు అమాయకంగా పడిపోయారు. పాలిటిక్స్‌లో 'ఫార్టీ ఇయర్స్ ఇండస్ట్రీ' అయిన బాబు బలహీనత తెలుసుకున్న ఆ బాబు.. 'మళ్లీ మనదే అధికారం. మీరు బేఫికర్‌గా ఉండండి' అని అరచేతిలో వైకుంఠం చూపారు. జనమంతా మీ వైపే అన్నారు.. జగన్‌కు ఏమీ లేదన్నారు.. పాలనపై ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారన్నారు.. సమస్యల రహిత రాష్ట్రమని, ప్రజలు తెగ మెచ్చుకుంటున్నారని గ్యాస్ కొట్టారు.

చేతిలో తరాజు పెట్టుకుని, రోజూ జనం సంతృప్త స్థాయిని తూకం వేసే మొనగాడాయన. ప్రజల సంతృప్తి శాతం 80 నుంచి ఏకాఏకి 92 శాతం వరకూ ఉన్నట్లు భ్రమల్లో ఉంచి, ముంచారు. అప్పట్లో ఓ యువనేత వద్ద సలహాదారుగా ఉన్న మరొకాయన కూడా ఈ సారు మేథస్సులో భాగమయ్యారు. ఆ తర్వాత ఆయన ఎన్నికల ముందు చంద్రబాబును పొగుడుతూ పుస్తకం కూడా రాశారనుకోండి. అది వేరే విషయం.

రోజూ ఫోన్లలో వేలమందితో మాట్లాడి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నామని.. వారిలో 85 శాతం బాబు పాలనపై ఫుల్ హ్యాపీగా ఉన్నారని, రంగుల రంగుల టేబుల్స్ వేసి మరీ చంద్రబాబుకు ఇచ్చేవారు. దానితో చంద్రబాబు కూడా వాళ్ల మాయకు పడిపోయారు. కాకిలెక్కలు నమ్మేశారు. అఫ్ కోర్స్.. అప్పట్లో కలెక్టర్లు కూడా ఆ సారు వాడిన గ్యాస్ కంపెనీనే వాడి, చంద్రబాబుకు దేవతావస్త్రాల కథలు చెప్పి, నిండా ముంచేశారనుకోండి.

సీన్ కట్ చేస్తే జగనన్న సర్కారు అధికారంలోకి వచ్చింది. కాబట్టి కచ్చితంగా ఆయనను పక్కనపెట్టాలి. పైగా జగన్ విపక్ష నేతగా ఉన్నప్పుడు, ఆ మ్యాజిక్ మాస్టర్‌పై నందిగామలో చేయి చేసుకున్నారు. కాబట్టి జగన్ ఆ ఐఏఎస్ సారు లెక్కప్రకారం, ఆ ఐఏఎస్ సారుకు అసలు పోస్టింగే ఇవ్వకూడదు. సీనియర్ ఐపిఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు విషయంలో జగనన్న ఈ పాలిసీనే పాటించారు.

కానీ విచిత్రం జగనన్నను కూడా సారు మెప్పించేశారు. కీలకమైన వ్యవసాయశాఖ కట్టబెట్టారు. జగనన్న ముచ్చటపడి రాష్ట్రానికి తెచ్చుకున్న అమూల్ ప్రాజెక్టుకు స్పెషలాఫీషర్‌గా నియమించారు. కో ఆపరేటివ్, కో ఆపరేటివ్ సొసైటీస్ ఎండీగా నియమించారు. దానితో జగనన్న కళ్లలో మెరుపుల కోసం.. టీడీపీ నుంచి 5 సార్లు గెలిచిన సీనియర్ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రను దుంపతెంచారు. ఆయనను 'కేవలం 32 రోజులు మాత్రమే' విజయవంతంగా జైల్లో ఉంచారు.




ధూళిపాళ్ల చైర్మన్‌గా ఉన్న సంగం డైరీని మూయించేందుకు శ్రమదానం చేశారు. అధికారులతో అర్ధరాత్రి దాడులు చేయించారు. ఉద్యోగులను భయభ్రాంతులను చేశారు. న్యాయపోరాటంతో నరేంద్ర గండం గడిచి బయటపడ్డారు. చిత్తూరు డైరీని పుట్టిముంచి, అమూల్ పాపకు దాన్ని దక్కించేందుకు ఐఏఎస్ సారు పడని కష్టమంటూ లేదు. చంద్రబాబు కుటుంబ కంపెనీ అయిన హెరిటేజ్‌ను మూయించి, దానిని దెబ్బతీసేందుకు సారు పడ్డ కష్టం చూసి జగన్ మురిసి ముక్కలయ్యారు.

మళ్లీ సీన్‌కట్ చేస్తే.. ఎన్నికల్లో కూటమి సర్కారు విజయం సాధించింది. హెరిటేజ్, సంగం కంపెనీలను సమాధి చేసేందుకు జగన్ ఆడిన ఆటలో, కెప్టెన్ పాత్ర పోషించిన ఈ ఐఏఎస్ సారుకు, ఏబీ వెంకటేశ్వరరావు మాదిరిగా శంకరగిరి మాన్యాలు తప్పవని కార్యకర్తలు కలలుగన్నారు. కానీ విచిత్రం. ఫిషరీస్, హార్టికల్చర్ శాఖ అప్పగించారు.

మళ్లీ సీన్ కట్ చేస్తే... లేటెస్టుగా ఖజానాకు కాసులు తెచ్చే కీలక శాఖ అప్పగించింది. తాజాగా రాష్ట్ర పన్నుల శాఖ కమిషనర్ పదవి ఇస్తూ, ఉత్తర్వులు జారీ చేయడం టీడీపీ సోషల్‌మీడియా సైనికులను హాశ్చర్యపరిచింది. గతంలో టీడీపీ ప్రభుత్వ పతనానికి, చంద్రబాబు భ్రమల్లో ఉండేందుకు కారకుడైన అధికారి... టీడీపీ యుద్ధసేనాని ధూళిపాళ్ల నరేంద్ర, 32రోజులు జైల్లో ఉండేందుకు కారకుడైన అధికారికి.. కీలకమైన పోస్టింగ్ ఇవ్వడంపై, టీడీపీ సోషల్ మీడియా సైనికులు అగ్గిరాముళ్లల వుతున్నారు.

'బహుశా ఇంకా సీఎంగా జగన్, సీఎస్‌గా జవహర్‌రెడ్డి -సీఎంఓ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా పూనం మాలకొండయ్య కొనసాగుతున్నట్లుంది' అంటూ తెలుగు తమ్ముళ్లు వెటకారాలాడుతున్నారు. దీన్నిబట్టి జగన్ దన్నుతో సంగం-హెరిటేజ్‌లను వేధించిన అధికారికి, కీలకమైన పదవిని సిఫార్సు చేసిన ఉన్నతాధికారికి.. 'జగనాభిమానం' ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోందన్న విమర్శలు, తెలుగు తమ్ముళ్లు పార్టీ సోషల్‌మీడియాలో పోటాపోటీగా పంచుకుంటున్నారు.


సోషల్‌మీడియా కథనాల ప్రకారం.. హెరిటేజ్, సంగం ఇతర డైరీలని మూయించాలనే జగన్ కుతంత్రాలను అమలు చేసింది అంతా ఆ ఐఏఎస్ అధికారే. గత ప్రభుత్వంలో జగనన్న పాల వెల్లువ పేరుతో రెండు వేలు కోట్లు రుణం తీసుకుని, రకరకాల పాల డైరీ పరికరాలు కొనుగోలు చేశారు. వాటితో చిత్తూరు డైరీని పునరుద్ధరిస్తున్నామని చెప్పి, అంతా అయ్యాక చిత్తూరు డైరీని అమూల్ కి నామమాత్రం లీజు కి ఇచ్చారు.

2వేల కోట్లతో కొత్తగా కొన్న డైరీ ఎక్విప్మెంట్, ఈ విధంగా చిత్తూరు డైరీ ద్వారా అమూల్ చేతికి చిక్కింది. కానీ అమూల్ నుంచి జగన్ ప్రభుత్వం, ఒక్క పైసా కూడా తిరిగి వసూలు చేసిన పాపాన పోలేదు. ఏమిటి దీని వెనక మతలబు ? 2000 కోట్ల ప్రజాధనం, చిత్తూరు డైరీ ద్వారా అమూల్ కు చేరిందంటే దాని వెనుక వున్న పెద్దలు గద్దలు ఎవరు ? ఇదంతా అమూల్ పైన అవ్యాజమైన ప్రేమా? లేక ప్రజాధనాన్ని దోపిడీ చేసే కుతంత్రమా? ఒక పక్క ఇవన్నీ మౌలిక ప్రశ్నలు.

ఇంకోపక్క.. ఈ జనం సొమ్ము అమూల్ పాలైపోవటంలో కీలక పాత్ర ఎవరో కాదు. పర్యవేక్షణంతా ఆ ఐఏఎస్ అధికారే ఇక్కడ ఆంధ్రప్రదేశ్ అన్ని ప్రభుత్వ శాఖల్లో.. సాఫ్ట్వేర్ డెవలప్మెంట్ చేస్తామని దూరి స్వామి కార్యం, స్వకార్యం రెండూ చక్కబెట్టిన బినామీ కంపెనీ గురించి మాట్లాడుకోవాలి. ఆ బినామీ కంపెనీ పేరే కోడ్ ట్రీ సొల్యూషన్స్. ఈ కంపెనీ ఎవరిదో కాదు.. ఐఏఎస్ సారు గారి భార్య గారిదే, ఈ కంపెనీ కోడ్ ట్రీసొల్యూషన్స్!

కోఆపరేటివ్ సొసైటీల కంప్యూటరైజేషన్ పేరుతో, ఐఏఎస్ సారు గారి భార్య పేరుతో ఉన్న కోడ్ ట్రీసొల్యూషన్స్ కి ప్రభుత్వం నుంచి భారీ మొత్తంలో నిధులు మళ్ళించారు. జగన్ కుతంత్రాలకు అనుగుణంగా ఫ్యామిలీ సర్కస్ చేస్తూ... స్వార్థ ప్రయోజనాలు పొందారు ఐఏఎస్ సారు. అప్పట్లో డేటా మాయం చేస్తూ, రాష్ట్ర వినాశనం కోసం పనిచేశారు. ఇప్పుడు కూడా జగన్ కి, ఆ నీలి కూలి సైకో మీడియా ముఠాకు డేటా లీక్ చేస్తూ ప్రభుత్వం కి నష్టం చేస్తున్నారు. ఇలాంటి వ్యక్తులకు ఇప్పుడు కమర్షియల్ టాక్స్ పగ్గాలివడం అంటే.. కూర్చున్న కొమ్మను నరుక్కోవడమే కదా?!

ఈ మొత్తం కోడ్ ట్రీ సొల్యూషన్స్ కంపెనీ వ్యవహారంతో పాటు, 2వేల కోట్ల డైరీ ఎక్విప్మెంట్ మొత్తం అమూల్ డైరీకి చేరిన వ్యవహారం పై, నిష్కర్షగా ఎంక్వైరీ వేయించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఐఏఎస్ ముసుగులో ఉన్న వైఏఎస్ లతో పాటు, ప్రభుత్వ యంత్రాంగంలో వుంటూ గోతులు తీస్తున్న జగన్ కోవర్ట్ లను, ప్రభుత్వ వ్యవహారాల నుండి దూరంగా ఉంచాలని జగన్ బాధిత కూటమి కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు.



## 11 వేల అమెరికన్ వజ్రాలతో రతన్ టాటా చిత్రం

**సూరత్:** గుజరాత్లోని సూరత్ కు చెందిన విపుల్బాయ్ అనే వ్యాపారి రతన్ టాటాపై వినూత్న రీతిలో అభిమానం చాటుకున్నారు. ఏకంగా 11 వేల అమెరికన్ వజ్రాలతో రతన్ టాటా చిత్రాన్ని రూపొందించాడు. విపుల్ బాయ్ కళాకారుడు కావడంతో స్వతహాగా 11 వేల వజ్రాలతో ఆయన చిత్రాన్ని రూపొందించాడు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియోను రతన్ టాటా అభిమానులు సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు.

## ఆధ్యాత్మిక చింతన మనిషిని సన్మార్గం వైపు నడిపిస్తుంది

**భువనగిరి,మహానాడు:**

ఆధ్యాత్మిక చింతన అనిర్వచనీయమైన ప్రశాంతతనివ్వడంతో పాటు, మనిషిని సన్మార్గం వైపు నడిపిస్తుందని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు.

భువనగిరి జిల్లా నాగిరెడ్డిపల్లె లోని రమణేశ్వరం మహాక్షేత్రంలోని శివశక్తి



షిర్డీసాయి అనుగ్రహ మహాపీఠంలో 1023 పంచలోహ శ్రీచక్రాల మహా ఆలయమును మంత్రి కొండా సురేఖ సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి గారి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో మంత్రి సురేఖ పాల్గొన్నారు.

ఆలయ ఆవిష్కరణ అనంతరం ఆలయంలో కొలువైన 9 అడుగుల శ్రీచక్రంతో పాటు, 1023 శ్రీచక్రాలను మంత్రి సురేఖ దర్శించుకున్నారు. మహాశివుని ఆలయంలోని బంగారు శివలింగానికి మంత్రి సురేఖ, కుటుంబ సభ్యులు అభిషేకం నిర్వహించారు. అనంతరం భూప్రస్తార, కైలాసప్రస్తార మేరు ప్రస్తార ఆలయం, పంచలోహ శ్రీ కామేశ్వర కామేశ్వరి ఆలయం, పాలరాతి పెద్దమ్మవారిని, నవదుర్గలను, దశభైరవులు, దశ మాతృకలను సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

100 రోజుల అతిస్వల్ప సమయంలో అత్యంత వైభవోపేతంగా 1023 పంచలోహ శ్రీచక్రాలను ప్రతిష్ఠించడం అభినందనీయమని సిద్ధగురు రమణానంద మహర్షి కృషిని మంత్రి సురేఖ ప్రశంసించారు.

# కష్టపడి పని చేసినవారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుంది

- కష్టపడి పని చేస్తే పదవులు వెతుక్కుంటూ వస్తాయనే దానికి దామచర్ల సత్య ఉదాహరణ
- మంత్రి డా. డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి
- కొండపిలో అట్టహాసంగా దామచర్ల సత్య అభినందన సభ

**కొండపి,మహానాడు:**
తెలుగుదేశం పార్టీలో నిబద్ధతతో కష్టపడి పనిచేసే వారికి పదవులు వెతుక్కుంటూ వస్తాయనే దానికి దామచర్ల సత్య ఒక ఉదాహరణ అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.

ఆదివారం నాడు కొండపి సీతారామ కల్యాణ మండపంలో ఏపీ మ్యారిటైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్యకు అభినందన సభ నిర్వహించారు. ముందుగా కొండపి మెయిన్ సెంటర్ నుంచి కళ్యాణ మండపం వరకు కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభకు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి



డా.డోలాశ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ...... తెలుగు దేశం పార్టీలో నిబద్ధతతో కష్టపడి పనిచేసే వారికి పదవులు వెతుక్కుంటూ వస్తాయనే దానికి దామచర్ల సత్య ఒక ఉదాహరణ అని అన్నారు.

సత్య ఏ బాధ్యతలు అప్పగించినా సమర్థవంతంగా నిర్వర్తి ఇస్తాదని అన్నారు. చిన్న వయసులోనే చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించడం అభినందనీయమన్నారు. సత్య కార్యకర్తలకు ఏ కష్టం రాకుండా కంటికి రెప్పలా కాచుకునేవాడన్నారు. ఆయన కార్యకర్తలను ఆదరించే విధానం పార్టీకి చేసిన సేవను గుర్తించి చంద్రబాబు నాయుడు మారి టైం బోర్డు చైర్మన్ గా అవకాశం కల్పించి సత్కరించారన్నారు.

ఏ నాయకుడికైనా పదవులు అలంకారం మాత్రమేనని ప్రజలకు చేసిన సేవే చరిత్రలో మిగిలిపోతుందన్నారు. చంద్రబాబు నాయుడుకు సత్య మీద పూర్తి నమ్మకం ఉందన్నారు. సత్య భవిష్యత్ లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తున్నట్లు మంత్రి తెలిపారు. గత ఏళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి శూన్యమని, అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించారని అన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ని నిర్వీర్యం చేసారని, 5 ఏళ్లలో ఒక్కరికీ కూడా ఒక్క రుణం ఇచ్చిన పాపాన పోలేదన్నారు. తెలుగుదేశం పార్టీ 100 రోజుల పాలనలోనే అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలు అమలు చేస్తామని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమానికి కొండపి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## పట్నం మహేందర్ రెడ్డి ఏ పార్టీకి చెందిన వ్యక్తి?


- ఆయన విప్ జారీ చేస్తడా?
- బిఆర్ఎస్ పార్టీ ఇచ్చిన విప్‌ను పాటిస్తాడా?
- అధికార పార్టీ చీఫ్ విప్‌గా కౌన్సిల్ చైర్మన్ బులిటెన్ ఎలా ఇష్యూ చేస్తారు?
- మాజీ మంత్రి హరీష్ రావు

**హైదరాబాద్,మహానాడు:**
చీఫ్ విప్‌గా మహేందర్ రెడ్డి నియామకం రాజ్యాంగ విరుద్ధం. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్నది. బిల్ పాస్ చేయించడం, ప్రభుత్వ బిజినెస్ జరిగేలా చీఫ్ విప్ బాధ్యత. మహేందర్ రెడ్డి ఇప్పుడు ఎవరికి విప్ ఇష్యూ చేస్తాడు? అధికార పార్టీ సభ్యులకా? ప్రతి పక్ష పార్టీ సభ్యులకా? ఆయన విప్ జారీ చేస్తడా? లేక బిఆర్ఎస్ పార్టీ ఇచ్చిన విప్ ను పాటిస్తాడా?

విప్ అనే వ్యక్తి తన పార్టీ ఆదేశాలనుసారం నడుచుకోమని జారీ చేసేది విప్. ఎదుటి పార్టీ వారిని చీఫ్ విప్ చేస్తే ఏ పార్టీకి విప్ జారీ చేస్తాడు? బిఆర్ఎస్ పార్టీ విప్ ప్రస్తుత చీఫ్ విప్ కు విప్ జారీ చేసే పరిస్థితి వచ్చింది. రాష్ట్రంలో రాజ్యాంగ ఉల్లంఘన, రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్నారని ఎందుకు ఇది మరో ఉదాహరణ. పిఏసి, చీఫ్ విప్ ఎంపిక విషయాల్లో ఇది స్పష్టంగా అర్థమవుతున్నది. శాసనసభ సమావేశాలు ముగిసే నాటికి, బిఆర్ఎస్ పార్టీ సభ్యుల సంఖ్య 38 అని స్పీకర్ గారే చెప్పారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ వారు కూడా చెప్పారు. అలా చెప్పి మళ్లీ మా పార్టీ వాళ్లు కాదు అని మాట్లాడుతున్నారు. బిఆర్ఎస్ పార్టీ 38 మంది అని వాళ్లే చెప్తారు, మళ్ళీ మా వాళ్లు కాదు చెబుతారు.

చైర్మన్ దగ్గర మహేందర్ రెడ్డి అనర్హత పిటిషన్ పెండింగ్ లో ఉంది. ట్రిబ్యునల్ చైర్మన్ గా దాని మీద నిర్ణయం తీసుకోవాలి. ఇలాంటి సమయంలో అధికార పార్టీ చీఫ్ విప్ గా, అదే కౌన్సిల్ చైర్మన్ బులిటెన్ ఎలా ఇష్యూ చేస్తారు?

ఆయన అనర్హత పిటిషన్ లో చైర్మన్ ఇచ్చిన బుల్ టెన్ ఇంప్లీడ్ చేస్తాం. మహేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి తరపున ఎన్నికల్లో ప్రచారం చేశాడు. పార్టీ ఫిరాయింపు చేశాడని స్పష్టంగా అర్థమవుతుంది. మార్చి 15 నాడు చీఫ్ విప్ అని ఆర్డర్ ఇస్తే.. పంద్రాగస్టు, జూన్



2, సెప్టెంబర్ 17ఎమ్మెల్సీగా జెండా ఎగురేస్తారని జి ఏ డి అఫీషియల్ జీవో ఎలా ఇస్తుంది?

అనర్హత వేటు వేయాల్సిన కౌన్సిల్ చైర్మన్ స్వయంగా.. పట్నం మహేందర్ రెడ్డి చీఫ్ విప్ ఎంపికైనట్లు బులెటిన్ ఇవ్వటం రాజ్యాంగ విరుద్ధం. పట్నం మహేందర్ రెడ్డి అనర్హత పిటిషన్ కౌన్సిల్ చైరన్ దగ్గర పెండింగ్ లో ఉంది. రేవంత్ హయాంలో రాజ్యాంగం ఎలా ఖూనీ జరుగుతుందనే దానికి ఇదొక ఉదాహరణ. పీఏసీ చైర్మన్ పదవి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇలానే వ్యవహరించింది. అరికెపూడి గాంధీ.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అని స్వయంగా సీఎం, మంత్రులు చెప్పారు. పట్నం మహేందర్ రెడ్డి ఏ పార్టీకి చెందిన వ్యక్తి? ప్రభుత్వం చెప్పాలి.

## గ్యాంగ్ రేప్ బాధితులను పరామర్శించిన మంత్రి సవిత

- గత ప్రభుత్వ వైఫల్యాల కారణంగానే ఇలాంటి సంఘటనలు
- ఏపీ ప్రభుత్వం గంజాయిపై ఉక్కుపాదం మోపుతోంది : మంత్రి సవిత

**హిందూపురం,మహానాడు:**

శ్రీ సత్య సాయి జిల్లా హిందూపురం నియోజకవర్గం చిలమత్తూరు మండలం నల్ల బొమ్మిని పల్లి గ్రామ సమీపంలోఉపాది కోసం వలస వచ్చిన కుటుంబంపై, దుండగుల చేతిలో అత్యాచారానికి పాల్పడ్డ అత్త మరియు కోడలు హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించిన మంత్రి సవిత అధైర్య పడకండి.. మీకు ప్రభుత్వం అండగా ఉంటుందని పరామర్శించారు.

అనంతరం మీడియాతో మంత్రి సవిత మాట్లాడుతూ ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర హోంమంత్రి వగలపూడి అనిత, స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సీరియస్ గా తీసుకున్నారు. అమాయక మహిళలపై అతి దారుణమైన చర్య జరిగింది, గత ప్రభుత్వం వైఫల్యాల కారణంగానే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.




గత ఐదేళ్లలో గంజాయిని ప్రోత్సహించింది ఎవరో అందరికీ తెలుసునని గంజాయి వల్ల యువత పెడదారి పడుతోంది. ఏపీ ప్రభుత్వం గంజాయి పై ఉక్కుపాదం మోపుతోందని మంత్రి సవిత తెలియచేసారు. ఘటన జరిగి 24 గంటలు గడవకనే పోలీస్‌లు నిందితులను పట్టుకున్నారని, మొత్తం 6 గురు నిందితులు ఘటనలో ఉన్నారని.. వారంతా గంజాయికి అలవాటు పడినవారని అనేక కేసుల్లో నిందితులుగా ఉండి, జైళ్లకు కూడా వెళ్ళొచ్చారని పోలీసుల విచారణలో తెలుస్తున్నాయని తెలియచేసారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కొల్లకుంట ఆంజినప్ప, రాష్ట్ర కార్యదర్శి రామాంజినమ్మ, హిందూపురం పట్టణ అధ్యక్షులు డి ఈ రమేష్ స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.



తెలంగాణ శాసన మండలిలో ప్రతిపక్ష నేతగా భాద్యతలు స్వీకరించిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారికీ అభినందనలు తెలిపిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || సోమవారం 14, అక్టోబర్ 2024 ||





## దేశంలో నెంబర్ వన్ టాక్ షో అన్‌స్టాపబుల్ షో ఒక విస్ఫోటనం

ఆహా ఓటీటీ ప్లాట్‌ఫారమ్, ఎన్‌బికె మోస్ట్ ఎవైటెడ్ అన్‌స్టాపబుల్ సీజన్ 4 ను శనివారం అనౌన్స్ చేసింది. మునుపెన్నడూ చూడని సూపర్ హీరో పాత్రలో లెజెండరీ, షో హోస్ట్ నందమూరి బాలకృష్ణను ప్రజెంట్ చేసే అద్భుతమైన ఫస్ట్ లుక్, 3డి యానిమేటెడ్ ప్రోమోని లాంచ్ చేసింది. ట్రైలర్ లాంచ్ సందర్భంగా నటసింహం నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ..అందరికీ దసరా శుభాకాంక్షలు. గెలుపు అన్నది మన చేతుల్లోనే ఉంది. ఏదైతే కొత్తగా అనుకుంటామో ఆ జయం మనల్ని వరిస్తుంది. విజయానికి ప్రతీక ఈ దసరా శరన్నవరాత్రులు. అన్‌స్టాపబుల్ మొదలవడమే ఒక విస్ఫోటనం. విశ్వ విఖ్యాత నట సార్వభౌమ నందమూరి తారక రామారావు గారు నాకు కేవలం తండ్రి గానే కాకుండా గురువుగా దైవంగా భావిస్తాను. ఆయన ఎంతో ముందు చూపుతో వినూత్నమైన చిత్రాలు, అద్భుతమైన పాత్రలు చేశారు. ఆయన స్ఫూర్తి తోనే అన్‌స్టాపబుల్ ప్రోగ్రాం చేయడం జరిగింది. ఈ షో కూడా వేరే ఎవరైనా అడిగి ఉంటే చేసేవాడిని కాదు. కేవలం అరవింద్‌గారి కోసమే ఒప్పుకొన్నా. అన్‌స్టాపబుల్ అండ్ టీమ్ అంతా ఒక కుటుంబ సభ్యులులా పనిచేస్తూ కష్టపడ్డాం. ఆ కష్టానికి ఫలితమే అన్‌స్టాపబుల్ సక్సెస్. ఐఎండీబీ వరల్డ్ ర్యాంకింగ్స్‌లో ఈ షో 18వ స్థానంలో వుంది. అందరికీ కృతజ్ఞతలు' తెలిపారు.



## 'విశ్వంభర' అంచనాలు మించేలా ఉంటుంది

మెగాస్టార్ చిరంజీవి, వశిష్ట, యువి క్రియేషన్స్ 'విశ్వంభర'- ప్రేక్షకులని మెగా మాస్ బియాండ్ యూనివర్స్ లోకి తీసుకెళ్ళిన విజువల్లీ స్టన్నింగ్ టీజర్ మెగాస్టార్ చిరంజీవి హైలీ యాంటిసిపేటెడ్ క్రేజీ సోషియో-ఫాంటసీ ఎంటర్‌టైనర్ 'విశ్వంభర'. తన డెబ్యు మూవీ బింబిసారతో బ్లాక్ బస్టర్ అందించిన దర్శకుడు వశిష్ట 'విశ్వంభర' ను అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌గా తీర్చిదిద్దుతున్నారు. సక్సెస్ ఫుల్ నిర్మాణ సంస్థ యు.వి. క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం గ్రేట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ని అందించబోతోంది. మేకర్స్ ప్రామిస్ చేసినట్లుగా, దసరా సందర్భంగా మోస్ట్ అవైటెడ్ విశ్వంభర టీజర్ లాంచ్ చేశారు. విజువల్ స్టన్నింగ్ టీజర్, మూవీ ప్రిమైజ్ ని ప్రజెంట్ చేస్తూ ప్రేక్షకులని మెగా మాస్ బియాండ్ యూనివర్స్ లోకి తీసుకెళ్ళింది. మిస్టికల్ ల్యాండ్ స్కేప్ లో చేపల ఆకారంలో ఉన్న పక్షులు ఆకాశంలో ఎగురుతూ, గర్జించే ఖడ్గమృగాలు, ఎగిరే గుర్రాలని విజువల్ వండర్ గా ప్రజెంట్ చేస్తూ టీజర్ ఓపెన్ అయింది. ఒక దుష్ట శక్తి ఈ రాజ్యంలో అరాచకం సృష్టిస్తుంది. "విశ్వాన్ని అలుముకొన్న ఈ చీకటి విస్తరిస్తున్నంత మాత్రాన వెలుగు రాదని కాదు..ప్రశ్నలు పుట్టించిన కాలమే సమాధానాన్ని కూడా సృష్టిస్తుంది. విర్రవీగుతున్న ఈ అరాచకానికి ముగింపు పలికే మహాయుద్ధాన్ని తీసు కొస్తుంది" అనే పవర్ ఫుల్ వాయిస్ తో టీజర్ నెక్స్ట్ లెవల్ కి వెళ్ళింది. ఈ చీకటిని అంతం చేయడానికి మునుపెన్నడూ లేనివిధంగా ఒక లెజెండ్ వస్తారు.



## 'ఈశ్వర్' రీ రిలీజ్

పాన్ ఇండియన్ స్టార్, డార్లింగ్ ప్రభాస్ ఈశ్వర్ మూవీతో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ప్రభాస్ బర్త్ డే సందర్భంగా ఈశ్వర్ మూవీని రీ రిలీజ్ చేయనున్నారు. అక్టోబర్ 23న ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా రిలీజ్ చేయాలని ప్లాన్ చేశారు. ఈ క్రమంలో మూవీ ట్రైలర్‌ను అదిరిపోయేలా కట్ చేసి రిలీజ్ చేశారు.


రీ ఇంట్రడ్యూసింగ్ ప్రభాస్ అంటూ వదిలిన ఈశ్వర్ ట్రైలర్ ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటోంది. నీ చేతిలో డబ్బుంటే.. నా ఛాతిలో దమ్ముంది అంటూ ప్రభాస్ చెప్పిన మాస్ డైలాగ్స్, యాక్షన్ సీక్వెన్స్, కామెడీ, రొమాంటిక్ సాంగ్స్ ఇలా అన్నింటినీ ట్రైలర్‌లో పొందుపర్చారు. ఈ మూవీని జయంత్ సీ పరాన్జీ తెరకెక్కించారు. కె. అశోక్ ఈ చిత్రాన్ని నిర్మించారు.

ప్రస్తుతం ఈ మూవీని లక్ష్మీ నరసింహా మూవీస్ రీ రిలీజ్ చేస్తున్నారు. అసలే టాలీవుడ్ ఆడియెన్స్ అంతా కూడా రీ రిలీజ్‌లను ఓ పండుగలా సెలెబ్రేట్ చేసుకుంటున్నారు. ఇక ఇప్పుడు ప్రభాస్ బర్త్ డేని కూడా ఈశ్వర్ రీ రిలీజ్‌తో గ్రాండ్‌గా సెలెబ్రేట్ చేసుకునేందుకు డార్లింగ్ ఫ్యాన్స్ రెడీగా ఉన్నారు.

## నాని ఓదెల2 లాంచ్



నేచురల్ స్టార్ నాని సెన్సేషనల్ హిట్ 'దసరా' తర్వాత హైలీ యాంటిసిపేటెడ్ సెకండ్ కొలబరేషన్ కోసం దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ నిర్మాత సుధాకర్ చెరుకూరితో మళ్లీ చేతులు కలిపారు. ఎనాని ఓదెల2 స్టన్నింగ్ పోస్టర్‌తో అనౌన్స్ చేశారు. ఈ ప్రాజెక్ట్ దసరాకి 100 రెట్లు ఇంపాక్ట్ ని క్రియేట్ చేయాలనే టార్గెట్ పెట్టుకున్నట్లు నాని ఇటీవలే చెప్పారు. దసరా పలు అవార్డులను అందుకోవడం, హ్యూజ్ పాపులారిటీని సాధించడంతో, ఈ పాన్ ఇండియా చిత్రంపై భారీ అంచనాలు ఏర్పడాయి. మేకర్స్ దసరా శుభ సందర్భంగా సినిమాని గ్రాండ్ గా లాంచ్ చేశారు, శ్రీకాంత్ ఓదెల మునుపెన్నడూ చూడని మాస్ క్యారెక్టర్‌లో నానిని ప్రెజెంట్ చేసే గ్రిప్పింగ్ స్క్రీన్‌ప్లేతో ఆకట్టుకునే, లార్జర్ దెన్ లైఫ్ కథని రూపొందించారు. మోస్ట్ ఫెరోషియస్ పాత్ర కోసం నాని మేకోవర్ కి సిద్ధంగా ఉన్నారు.




## 'హరి హర వీర మల్లు పార్ట్-1 స్వోర్డ్ వర్సెస్ స్పిరిట్' మొదటి గీతం

ప్రాంతీయ భాషా చిత్రాలతోనే జాతీయ స్థాయి గుర్తింపు పొందిన అతికొద్ది మంది కథానాయకులలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఒకరు. ఆయన తన సినీ ప్రయాణంలో తొలిసారిగా 'హరి హర వీర మల్లు పార్ట్-1 స్వోర్డ్ వర్సెస్ స్పిరిట్' అనే పీరియాడికల్ యాక్షన్ సినిమాలో నటిస్తున్నారు. ప్రేక్షకులకు ప్రత్యేకమైన మరియు మరపురాని థియేట్రికల్ అనుభవాన్ని అందించాలనే లక్ష్యంతో నిర్మాతలు భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రజాసేవకు అధిక ప్రాధాన్యత ఇస్తూ చిత్రీకరణకు విరామం ఇచ్చిన పవన్ కళ్యాణ్, ఇటీవలే తిరిగి చిత్రీకరణలో పాల్గొన్నారు. హాలీవుడ్ దిగ్గజ యాక్షన్ దర్శకుడు నిక్ పావెల్ ఆధ్వర్యంలో భారీ యుద్ధ సన్నివేశాన్ని చిత్ర బృందం చిత్రీకరించింది. పవన్ కళ్యాణ్‌తో పాటు 400 - 500 మంది ఆర్టిస్టులు పాల్గొన్న ఈ భారీ యుద్ధ సన్నివేశానికి యాక్షన్ దర్శకుడుని ప్రత్యేకంగా నియమించారు. ఇప్పుడు, దసరా శుభ సందర్భంగా నిర్మాతలు చాలా ప్రత్యేకమైన వార్తను ప్రకటించారు. త్వరలోనే ఈ సినిమా నుంచి మొదటి గీతం విడుదల కానుంది. పవన్ కళ్యాణ్ అభిమానులతో పాటు, తెలుగు సినీ ప్రియులు ఆనందపడే మరో విషయం ఏంటంటే తెలుగులో ఈ పాటను స్వయంగా పవన్ పాడారు. ఈ గీతాన్ని ఇతర భాషలలో ఇతర గాయకులు పాడారు.

### సినీ ప్రముఖుల సమక్షంలో

## "పెన్ డ్రైవ్" ప్రారంభం

శ్రీ కృష్ణ మూవీస్ బ్యానర్ పై కటకం వెంకటేశ్వర్లు సమర్పణలో విష్ణు వంశీ, రియా కపూర్ హీరో హీరోయిన్లుగా దర్శకుడు ఎంఆర్ దీపక్ రూపొందిస్తున్న సినిమా "పెన్ డ్రైవ్". కె.



రామకృష్ణ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. బుజ్జి బొగ్గారపు సహ నిర్మాత. నేటితరం ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యేలా సమకాలీన కథా కథనాలతో తెరకెక్కనున్న ఈ సినిమా పలువురు సినీ ప్రముఖుల ఆధ్వర్యంలో ఘనంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి సాయి కుమార్ క్లాప్ నివ్వగా...నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ ఫస్ట్ షాట్ డైరెక్షన్ చేశారు. నిర్మాత కె రామకృష్ణ కెమెరా స్విచ్చాన్ చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు ఎంఆర్ దీపక్ మాట్లాడుతూ – టెక్నాలజీ మనకు ఎంతగానో అందుబాటులోకి వచ్చింది. దీన్ని సద్వినియోగం చేసుకోవాలి. కానీ కొందరు దుర్వినియోగం చేస్తూ క్రైమ్స్‌కు పాల్పడుతున్నారు.

టెక్నాలజీతో క్రైమ్స్ చేయడం సులువే కానీ తప్పించుకోవడం కష్టం. టెక్నాలజీని మంచికి ఉపయోగించాలనే మంచి సందేశాన్ని మా పెన్ డ్రైవ్ చిత్రంలో చెబుతున్నాం. ఇంటర్నెట్, సోషల్ మీడియాలో ఉచితంగా వచ్చే దేనికీ ఆశపడకూడదు. అలా ఆశపడితే ఇబ్బందులు పడతారనే అంశాన్ని చూపిస్తున్నాం. ఈ నెల 22వ తేదీ నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించి నాలుగు షెడ్యూల్స్ లో సినిమా పూర్తి చేస్తాం అన్నారు.



## రామ్ పోతినేని రాబిన్‌హుడ్ అనౌన్స్‌మెంట్

ఉస్తాద్ రామ్ పోతినేని తన 22వ మూవీని దసరా పండగ సందర్భంగా అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు. 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి'తో అలరించిన మహేష్ బాబు పచ్చిగొల్ల ఈ ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్‌కి దర్శకత్వం వహించనున్నారు. ఈ చిత్రాన్ని ప్రముఖ టాలీవుడ్ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనుంది. రాబిన్‌హుడ్22 రామ్ కెరీర్‌కు సిగ్నిఫికెంట్ ఎడిషన్ కానుంది. ఇటీవల యాక్షన్-ఓరియెంటెడ్ పాత్రలతో అలరించిన రామ్ ఈ మూవీలో ఓ యూనిక్ క్యారెక్టర్‌లో కనిపించనున్నారు. రామ్ స్టైలిష్ మేకోవర్‌లో కనిపించనున్నారని అనౌన్స్‌మెంట్ పోస్టర్ ద్వారా తెలుస్తోంది.

ఈ చిత్రం ఇంపాక్ట్ ఎమోషన్స్‌ని ఎక్స్ ఫ్లోర్ చేయనుంది. రామ్ కెరీర్‌లో ల్యాండ్‌మార్క్ చిత్రాలలో ఒకటిగా నిలుస్తుంది. దర్శకుడు మహేష్ బాబు తన మునుపటి చిత్రాలలో హ్యూమర్, ఎమోషన్స్ బ్లెండ్ చేసి అలరించారు , అప్ కమింగ్ మూవీ కంప్లీట్ ఎంటర్ టైనర్ గా ఉంటుందని హామీ ఇచ్చారు.

## "దో కమీనే" సినిమా ప్రారంభం

టాలీవుడ్‌లో పలు సూపర్ హిట్ చిత్రాలను రూపొందించిన దర్శకుడు సముద్ర వారసులు అరుణ్ మహాశివ, రామ్ త్రివిక్రమ్ హీరోలుగా "దో కమీనే" సినిమా లాంఛనంగా ప్రారంభమైంది. "షోలే", "ఆర్ఆర్ఆర్" కలిపితే ఎలా ఉంటుందో అలాంటి స్క్రిప్ట్ తో ఈ సినిమా రూపొందనుంది. ఈ చిత్రాన్ని హారిక సమర్పణలో చందు క్రియేషన్స్ బ్యానర్ పై ప్రొడ్యూసర్ చంద్ర పులుగుజ్జు నిర్మిస్తున్నారు. సముద్ర దర్శకత్వం వహిస్తున్నారు. తన్మయి, శ్రీ రాధ హీరోయిన్స్ గా నటిస్తున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవంలో యాక్టర్స్ శ్రీకాంత్, సుమన్, దర్శకులు బి గోపాల్, ఎవిఎస్ రవికుమార్ తదితరులు అతిథులుగా పాల్గొన్నారు. ముహూర్తపు సన్నివేశానికి సుమన్ క్లాప్ నివ్వగా బి.గోపాల్ ఫస్ట్ షాట్ డైరెక్షన్ చేశారు, హీరో శ్రీకాంత్ స్క్రిప్ట్ అందించారు, నందమూరి మోహనకృష్ణ కెమెరా స్విచ్చాన్ చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ వి సముద్ర మాట్లాడుతూ – పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా దో కమీనే సినిమాను రూపొందిస్తున్నాం. మా మూవీ ప్రారంభోత్సవానికి ఎంతోమంది మిత్రులు, పెద్దలు




వచ్చి ఆశీర్వదించారు. వారికి కృతజ్ఞతలు చెబుతున్నాం. నా మిత్రుడు చంద్ర ఈ సినిమాను ప్రొడ్యూస్ చేస్తున్నారు. నవంబర్ 3వ వారం నుంచి దో కమీనే సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం.

Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144

డిజిటల్ న్యూస్ పేపర్
సోమవారం 14, అక్టోబర్ 2024

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ మీడియాలో ..

# జయహో "మహానాడు"

# 2,03,132

## ఈ-పేపర్ పాఠకులకు సగర్వంగా సవినయంగా సెల్యూట్



మార్చి 1న ప్రారంభమైన మన
మహానాడు ప్రస్థానంలో కలిసి నడుస్తున్న
మా అభిమాన పాఠకుల
అనుబంధానికి వందనం





సీనియర్ జర్నలిస్ట్
మార్తి సుబ్రమణ్యం
సంపాదక సారధ్యంలో





బోడేపూడి సుబ్బారావు (BSR)
సారధ్యంలో

